
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
ఖమ్మం
సోమవారం ఉష్ణోగ్రత ఖమ్మం: గరిష్ఠం 31 । కనిష్ఠం 22 | భద్రాద్రి: గరిష్ఠం 33 । కనిష్ఠం 22 మంగళవారం, 23 జనవరి 2024





ఆంధ్రజ్యోతి పత్రికలో ప్రచురితమైన కథనాలు

అవినీతి అడ్డా

- అక్రమాలకు కేంద్ర బిందువుగా ఖమ్మం నగరపాలకం?
- ఖాళీస్థలాలకు ఇంటి నెంబర్ల కేటాయింపు
- 58, 59 జీవో అక్రమాలకు మూలాలూ అక్కడే
- ఇష్టారాజ్యంగా అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల నియామకాలు
- అక్రమ నిర్మాణాలను పట్టించుకోని టౌన్‌ప్లానింగ్ విభాగం
- నేడు కార్పొరేషన్ కార్యాలయంలో మంత్రి తుమ్మల సమీక్ష

ఖమ్మం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ప్రజాపరిపాలనలో కలెక్టరేట్‌కు దీటుగా కార్యకలాపాలు సాగించచాల్సిన కార్యాలయం అది.. జిల్లా అభివృద్ధికి మార్గదర్శకంగా నిలిచేలా కార్యకలాపాలు సాగించాల్సి ఆ కార్యాలయం గత కొన్నేళ్లుగా అడ్డగోలు వ్యవహారాలకు వేదికగా మారింది. ఖమ్మం నగరపాలక సంస్థ కార్యాలయంలో గత కొన్నేళ్లుగా జరిగిన అక్రమాలు తవ్వుతున్న కొద్దీ ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. నగర పరిధిలోఎలాంటి అక్రమాలు జరిగినా వాటి మూలాలు మాత్రం కార్పొరేషన్ కార్యాలయంలోనే ఉంటున్నాయి. కార్యాలయంలోని కొందరు అధికారులు అక్రమార్కులకు వంతుపాడుతున్నట్లు అవినీతికి అడ్డాగా మార్చారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇటీవల కాలంలో వరుసగా వెలుగులోకి వస్తున్న ఘటనలే ఇందుకు సాక్ష్యంగా నిలుస్తున్నాయి. మంగళవారం ఖమ్మం కార్పొరేషన్ కార్యాలయంలో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమీక్ష నిర్వహించనున్న నేపథ్యంలో నగర పరిధిలో వెలుగు చూస్తున్న అక్రమాలపై 'ఆంధ్రజ్యోతి' అందిస్తున్న ప్రత్యేక కథనం..

ఖాళీస్థలాలకు ఇంటి నెంబర్లు..

ఖమ్మంనగర పరిధిలోని ప్రభుత్వ భూములకు, ఇతర ఖాళీ స్థలాలకు కొందరు ఇంటి దొంగలు ఇంటి నెంబర్లు కేటాయించి అందినకాడికి దండుకున్నారు. ఒక్కో స్థలానికి రూ.లక్ష వరకు వసూలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇలా చేసిన దొంగ అసెస్‌మెంట్ల వ్యవహారాన్ని 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తెచ్చింది. దాంతో ఉన్నతాధికారులు గతేడాది ప్రారంభం నుంచి వేసిన అసెస్‌మెంట్ల వివరాలను బిల్ కలెక్టర్లతో మరోసారి విచారణ చేయించారు. ఆ సమయంలో అసెస్‌మెంట్లు వేయించుకున్న ఎనిమిది మందిపై రెండు కేసులు నమోదు చేయించారు. విచారణలో 36 వరకు మాత్రమే అసెస్‌మెంట్లు బయటపడ్డాయనీ కార్యాలయ ఉన్నతాధికారులు వెల్లడించారు. అయితే సదరు కార్యాలయ ఉన్నతాధికారులకు తెలియకుండా ఇంటిదొంగలు వేసిన దొంగ అసెస్‌మెంట్లు గుట్టుచప్పుడు కాకుండా డియాక్టివేట్ చేశారు. ఇక తాజాగా 58, 59 జీవోల పేరుతో పదుల సంఖ్యలో స్థలాలు అక్రమంగా క్రమబద్ధీకరణ జరిగినట్లు వెలుగులోకి వచ్చింది. సుమారు 40కి పైగా స్థలాలు అక్రమంగా క్రమబద్ధీకరణ జరిగినట్లు ఆధారాలతో సహా 'ఆంధ్రజ్యోతి' కథనం ప్రచురించింది. ఈ వ్యవహారంలోనూ విచారణ నిర్వహించిన అధికారులు ఒక్కటే స్థలానికి సంబంధించిన డాక్యుమెంట్‌ను రద్దు చేశారు. మిగిలిన వాటిపై మాత్రం ఇప్పటివరకు ఎలాంటి చర్యలకు ఉపక్రమించలేదు. దొంగ అసెస్‌మెంట్ల వ్యవహారం వెలుగులోకి వచ్చినప్పుడు కేవలం సంబంధిత సెక్షన్‌లో ఉన్న అధికారులను ఇతర సెక్షన్‌కు మార్చారే తప్ప వారిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఆ తర్వాత 59 జీవో అక్రమాలకు మూల కారణంగా దొంగ అసెస్‌మెంట్లే అని తేలినా ఈ వ్యవహారంలోనూ క్రమబద్ధీకరణ చేయించుకున్న వ్యక్తులపై మాత్రమే చర్యలు తీసుకున్నారు తప్ప బాధ్యులుగా ఉన్న అధికారులపై మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోలేదు.


ఖమ్మం కార్పొరేషన్ కార్యాలయం

ఇష్టారాజ్యంగా అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల నియామకాలు

వడ్డించే వాడు మనవాడైతే ఎక్కడ ఉన్నా విస్తరి నిండుతుందన్నట్లు.. కార్పొరేషన్ కార్యాలయంలో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగం పొందాలంటే కొందరు అధికారులను ప్రసన్నం చేసుకుని, అమామ్యాలు సమర్పించుకుంటే కొద్ది రోజుల్లోనే కొత్త ఉద్యోగం చేస్తూ నెలవారీ జీతం కూడా డ్రా చేయొచ్చన్న విమర్శలు ఉన్నాయి. సంబంధిత కార్యాలయ ఉన్నతాధికారికి ఏ మాత్రం అనుమానం రాకుండా కొందరు కార్పొరేషన్ అధికారులు ఐడీ గారడీ ప్రదర్శించి కార్యాలయంలో పనిచేస్తున్న సిబ్బంది సంఖ్యను అలాగే ఉంచి ఖాళీ అయిన పోస్టులలో కొత్తవారిని నియమించి వారికి మరో ఐడీ నెంబర్‌ను కేటాయించి విధుల్లోకి తీసుకోవడం, పేషీట్‌లోకి ఎక్కించి నెలవారీ వేతనం చెల్లింపు కార్యక్రమాలకు కొందరు ఇంటిదొంగలు శ్రీకారం చుట్టారన్న విమర్శలున్నాయి. అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో ఎవరైనా ఉద్యోగం మానేసినా, 60 యేళ్లు పైబడినా, వరుసగా విధులకు హాజరుకాకపోయినా వారిని పక్కనపెట్టి వారి స్థానంలో కొత్త ఉద్యోగులను చేర్చారన్న ఆరోపణలున్నాయి. అందువల్లనే గత రెండున్నరేళ్లుగా పోస్టుల ఖాళీలు కనిపించడంలేదు. సంబంధించి ఉన్నతాధికారికి ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే ఈ వ్యవహారం నడిపిస్తున్నట్లు తెలుస్తోంది. గడిచిన రెండేళ్లలో సుమారు 130 మంది ఉద్యోగులను ఐడీ నెంబర్లు మార్చి అధికారులను ఏమార్చినట్లు తెలుస్తోంది. ఇలా వచ్చినవారిలో కొందరు జవాన్లు కూడా ఉండటం ఈ వ్యవహారంలోనూ పెద్దమొత్తంలో నగదు చేతులు మారాయన్న ఆరోపణలు ఉన్నాయి. ఒక్కొక్క ఉద్యోగి నుంచి రూ.2లక్షల వరకు వసూలు చేసినట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారంలో ఓ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి ఆత్మహత్యకు పాల్పడినట్టుగా ఆరోపణలు ఉండగా.. దానికి సం బంధించి కార్పొరేషన్ కార్యాలయంలోని ఉద్యోగులపై కూ డా కేసు నమోదవగా ఆకేసు ముందుకు సాగలేదు. అంతేకాకుండా అక్రమంగా అవుట్‌సోర్సింగ్ నియామకాలు చేపట్టారని కొందరు యువత ఫిర్యాదు చేయడంతో విజిలెన్స్ విచారణ కూడా జరిగింది. కానీదానికి సంబంధించిన వివరాలు కూడా నేటికీ రాలేదు. ఈ మొత్తం వ్యవహారం లో గతంలో కార్యాలయంలో ఉన్నతస్థానంలో పనిచేసిన ఓ అధికారి కీలకంగా వ్యవహరించారన్న ఆరోపణలున్నాయి. ప్రస్తుతం అసలు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఎవరెవరు ఎక్కడెక్కడ పనిచేస్తున్నారో కూడా తెలియని పరిస్థితి నెలకొంది.

వేలిముద్ర వారినీ 'కేటగిరీ-2'కు మార్పు

పీఆర్సీ సమయంలో కేటగిరీల విభజనలోనూ అధికారులు ఎలాంటి సర్టిఫికెట్ వెరిఫికేషన్ లేకుండానే తమకు అనుకూలంగా ఉండే ఉద్యోగుల కేటగిరీలను మార్చి జీతాలను పెంచారన్న ఆరోపణలున్నాయి. కేటగిరి-1లో రూ.12వేలు జీతం ఉండగా.. కేటగిరీ-2లో రూ.15వేల జీతం ఉంటుంది. అయితే కేటగిరీ-2కు సంబంధించి ఆయా ఉద్యోగులు టెక్నికల్ సర్టిఫికేట్లను ఇవ్వాల్సి ఉంటుంది. అయితే అలాంటి సర్టిఫికెట్లేవీ లేకుండానే సుమారు 350 మందిని కేటగిరి-2లో చేర్చి వేతనాలు పెంచిన విషయం బయటకు పొక్కడంతో మొత్తం వ్యవహారం హైదరాబాదుకు చేరింది. దాంతో ఆయా ఉద్యోగులకు ఓ సంస్థ ద్వారా మూడు రోజులపాటు శిక్షణ ఇప్పించగా ఆ సర్టిఫికెట్లు కూడా నేటివరకు రాకపోవడం గమనార్హం. ఆ శిక్షణ సమయంలో శిక్షనిచ్చిన సంస్థకు నగదు చెల్లించాలంటూ మొదట ఆయా ఉద్యోగుల జీతాల్లో కోత వేయగా ఈ విషయం కమిషనర్ దృష్టికి వెళ్లడంతో తిరిగి ఉద్యోగుల అకౌంట్లలో ఆ సొమ్ము జమ చేసినట్టు తెలిసింది. అయినా కొందరు మధ్యవర్తులు మాత్రం అనధికారికంగా సుమారు రూ.10లక్షల వరకు సంబంధిత కాంట్రాక్టు కార్మికుల నుంచి వసూలు చేశారన్న ఆరోపణలున్నాయి. కాగా కేటగిరీ-2కు అసలైన అర్హులు ఉన్నా వారిని పక్కన పెట్టి తమకు అనుకూలంగా ఉన్నవారిని మాత్రమే కేటగిరి-2 చేర్చినట్టు భారీగా ఆరోపణలున్నాయి. ఇలా కేటగిరి-2లోకి మారిన వారిలో చాలమంది వేలిముద్ర వేసే వారుండటం గమనార్హం.

అక్రమ నిర్మాణాల్లోనూ కొందరి హస్తం..

ఖమ్మం నగరంలో ఏవైనా అనుమతులు మంజూరు చేసేటప్పుడు జాగ్రత్తగా పరిశీలించాల్సిన కొందరు అధికారులు వాటిని పట్టించుకోకుండా అక్రమార్కులకు కొమ్ముకాశారన్న విమర్శలున్నాయి. ఎక్కడో ఉన్న ప్రైవేటు స్థలాల్లో నిర్మాణాలకు అనుమతులు తీసుకొని ప్రభుత్వ స్థలాల్లో నిర్మాణాలు చేపట్టిన వ్యవహారం వెలుగులోకి రావడమే ఇందుకు నిదర్శనంగా నిలుస్తోంది. అంతేకాకుండా గతంలో అవుట్‌సోర్సింగ్ వర్కర్లను జవాన్లుగా నియమించగా వారు తమకు చెందిన డివిజన్లలో ఇష్టారీతిన పనులు చేసుకుంటూ పోతున్నారని, గతంలో తమకు అనుకూలంగా ఉన్న కార్పొరేటర్ల సహకారంతో ఉద్యోగంలో చేరినవారు సంబంధిత కార్పొరేటర్లు చేసే ఆరాచకాలకు వంతపాడుతూ పెత్తనం చెలాయిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో మంగళవారం కార్పొరేషన్ కార్యాలయంలో మంత్రి తుమ్మల రివ్యూ నిర్వహిస్తుండటంతో అక్రమార్కుల్లో వణుకు మొదలైంది. ఒకవైపు మంత్రి తుమ్మల గతంలో చెప్పినట్టుగా ఇప్పటికే ప్రక్షాళన ప్రక్రియ మొదలు పెట్టగా, నేడు రివ్యూ సమావేశంలో తమ అక్రమాలపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటారోనన్న భయాందోళనలో కొందరు ఉద్యోగులు ఉన్నారు. కాగా కార్పొరేషన్ పరిధిలో జరుగుతున్న అక్రమాలపై పూర్తిస్థాయిలో విచారణ జరిపించి సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పైసా లేనిదే పని జరగదు

- ముడుపులు చెల్లిస్తేనే వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లు
- స్తంభాలు ఎక్కి పనులు చేస్తున్న వాచ్‌మెన్‌లు
- సమయం పాటించని కార్యాలయ ఉద్యోగులు
- ఇదీ ఖమ్మం జిల్లాలో విద్యుత్‌శాఖ పనితీరు
- నేడు జిల్లాకు టీఎస్ఎన్‌పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి
- డీపీఆర్సీ భవన్‌లో వ్యవసాయ మోటర్లు, విద్యుత్ సమస్యలపై సమీక్ష

ఖమ్మం సంక్షేమవిభాగం, జనవరి 22: రైతులకు పైసా ఖర్చు లేకుండా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు నుంచి అవి మరమ్మతులకు గురైతే కేవలం 48గంటలలోపుగా పైసా ఖర్చు లేకుండా విద్యుత్‌శాఖాపరంగా అన్ని ఖర్చులు తామే భరించి రైతులకు ఆర్థిక భారం తగిస్తామని విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు పదేపదే చెప్పారు. ఏడాది క్రితం ఖమ్మం డీపీఆర్సీ భవనంలో విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వినియోగదారుల ఫిర్యాదుల దినోత్సవంలో విద్యుత్ నియంత్రణ మండలి ఛైర్మన్ రంగరావు ఈ ఆదేశాలను ఖచ్చితంగా అమలు చేస్తున్నామని తెలిపారు. కానీ సమావేశం మరుసటి రోజు నుంచే అధికారుల చేతి వాటం తిరిగి మొదలైంది.

ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులకు రూ.6వేలు పైమాటే

వ్యవసాయ విద్యుత్ మోటరు మరమ్మతులకు గురైతే సంబందిత అధికారులకు బాధిత రైతు సమాచారం అందించిన తర్వాత 48గంటలలోపుగా ఎటువంటి చార్జీలు లేకుండా ఉచితంగా మరో ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయాల్సి ఉంది. కానీ వాస్తవ పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోతే రైతులే స్వయంగా వాహనాల్లో తల్లాడ, సత్తుపల్లి, కూసుమంచి, గోపాలపురం, ఖమ్మం, కొత్తలింగాల ఎస్‌పీఎం షెడ్‌లకు తరలిస్తున్నారు. ఈ క్రమంలో లోడింగ్, అన్‌లోడింగ్‌కు రూ.1,000 వసూలు చేస్తున్నారు. ఛార్జింగ్ సమయంలో రూ.2వేలు, ట్రాక్టర్‌లకు రూ.3వేల వరకు ఖర్చవుతోంది. ఎస్‌పీఎం షెడ్ దూరాన్ని బట్టి ఒక్కో ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతుకు రూ.6నుంచి రూ.7వేలకు పైగా ఖర్చవుతోంది. ట్రాన్స్‌ఫార్మర్ల తరలింపునకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన వాహనాలను విద్యుత్‌శాఖలోని అధికారులు వాడుకుంటున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

పైసలిస్తేనే కొత్త కనెక్షన్‌లు

రైతులు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ కోసం దరఖాస్తు చేస్తే వరస క్రమంలో విద్యుత్ కనెక్షన్ ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. కానీ ఖమ్మం జిల్లాలో మాత్రం మామూళ్లు అందజేసిన వారికే ముందుగా విద్యుత్ కనెక్షన్‌లు ఇస్తుండటంతో డబ్బులు ఇవ్వలేని పేద రైతులు ఏళ్ల తరబడి ఎదురు చూస్తున్నారు. జిల్లాలో మొత్తం 1,751 వ్యవసాయ కనెక్షన్‌లు పెండింగ్‌లో ఉన్నాయి. గత ఆరు నెలల కాలంలోనే 448 మంది రైతులు వ్యవసాయ కనెక్షన్ కోసం దరఖాస్తు చేశారు. నిత్యం అధికారుల పర్యవేక్షణలో ఉండే ఖమ్మం డివిజన్‌తో పాటుగా ఖమ్మంరూరల్ సర్కిల్‌లోనే అత్యధికంగా వ్యవసాయ కనెక్షన్‌లు పెండింగ్‌లో ఉండటం గమనార్హం. ఇక వ్యవసాయ కనెక్షన్ కోసం దరఖాస్తు చేసిన రైతుల పొలాల్లోకి విద్యుత్ సరఫరా చేయాలంటే కనీసం రూ.7నుంచి రూ.9వేల వరకు రైతులు చెల్లించాల్సి ఉంటుందని పలువురు ఆరోపిస్తున్నారు.


మరమ్మతులకోసం విద్యుత్ స్తంభం ఎక్కుతున్న విద్యుత్ ఉపకేంద్రం వాచ్‌మన్


రైతులే ట్రాక్టర్‌పై తరలిస్తున్న వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లు

సంబంధం లేని ఉద్యోగులతో ప్రాణాలు బలి

విద్యుత్‌శాఖలో ఉద్యోగం అంటేనే ప్రమాదాలతో కూడి ఉండడంతో ఏ ఉద్యోగి ఏ పనులు చేయాలనే జాబ్‌చార్టు ఉంటుంది. అయితే సంఘాలు, ప్రజాప్రతినిధుల సిఫారసులతో జిల్లా కేంద్రంలో తిష్టవేసిన కొంతమంది ఉద్యోగులు వారు చేయాల్సిన పనులను సంబంధం లేనివారితో చేయించి వారి ప్రాణాలను బలి తీసుకుంటున్నారు. ఆరు నెలల క్రితం ఖమ్మంలోని ఐటీహబ్ వద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులకు గురైతే విద్యుత్ మీటరు రీడింగ్‌లు తీసే అన్‌మ్యాన్ సిబ్బంది పాషాను విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పనులకు పంపారు. దీంతో అతడు విద్యుత్ షాక్ గురయ్యాడు. ఈ వ్యవహారంలో ఇద్దరు ఉద్యోగులను స్థానికంగా బదిలీ చేసి అధికారులు చేతులు దులుపుకొన్నారు. అదేవిద్యుత్ ఉపకేంద్రంలో వాచ్‌మన్‌గా పనిచేస్తున్న వృద్ధుడిని ఖమ్మం ప్రధాన రహదారి వెంట విద్యుత్ స్తంభం ఎక్కించి పనులు చేయించారు. సిబ్బంది తక్కువగా ఉండటం వల్లనే వాచ్‌మన్‌ను విద్యుత్ స్తంభం ఎక్కించామని అధికారులు సమర్థించుకున్నారు. ఇలా ప్రతి రోజు సంబంధం లేని వ్యక్తులతో పనులు చేయించి విద్యుత్ ప్రమాదాలకు అధికారులే కారణమవుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

సమయం పాటించని ఉద్యోగులు

విద్యుత్‌శాఖ కార్యాలయంలో బాధ్యతలు నిర్వహించే ఉద్యోగుల కోసం ఆన్‌లైన్ హాజరు విధానం అమలులో లేదు. దీంతో సర్కిల్ కార్యాలయం, డివిజన్, ఈఆర్వో (రెవెన్యూ వసూళ్ల) కార్యాలయాల ఉద్యోగులు ఆలస్యంగా వచ్చి మధ్యాహ్నం భోజనానికి ఇంటికి వెళ్లి తీరిగ్గా సాయంత్రం 4గంటలకు మళ్లీ ఆఫీసులకు వస్తున్నారు. దీంతో సుదూర ప్రాంతాల నుంచి విద్యుత్ సమస్యలు, వినతులు, ఫిర్యాదులు చేసేందుకు వచ్చేవారు గంటల తరబడి వారికోసం ఎదురు చూడాల్సి వస్తోంది.

నేడు జిల్లాకు ఎన్‌పీడీసీఎల్ సీఎండీ

టీఎస్ఎన్‌పీడీసీఎల్ సీఎండీగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఐఏఎస్ అధికారి వరుణ్‌రెడ్డి మంగళవారం ఖమ్మం జిల్లాకు రానున్నారు. ఖమ్మం డీపీఆర్సీ సమావేశంలో నిర్వహించే సమీక్ష సమావేశంలో పాల్గొంటారు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల పెండింగ్‌కు కారణాలు, ట్రాన్స్‌ఫార్మర్స్ మరమ్మతుల కారణాలు, విద్యుత్ సమస్యలపై సమీక్షించనున్నారు. ఈ మేరకు విద్యుత్‌శాఖ ఎస్ఈ సురేందర్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు.

1,500 కనెక్షన్లు పెండింగ్‌లో ఉన్నాయి
సురేందర్, ఎస్ఈ, టీఎస్ఎన్‌పీడీసీఎల్

ఖమ్మం జిల్లాలో 1,500వరకు వ్యవసాయ కనెక్షన్లు పెండింగ్‌లో ఉన్నాయి. పంటలు ఉండటం వల్ల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ల ఏర్పాటులో జాప్యం జరుగుతోంది. సాధ్యమైనంతవరకు కనెక్షన్లు ఏర్పాటు చేస్తున్నాం. సాధారణ రివ్యూలో భాగంగా సీఎండీ జిల్లాకు వస్తున్నారు.

శోభాయరామం


లవకుశుల వేషధారణలో చిన్నారులు

- భద్రాద్రిలో కన్నులపండువగా శోభాయాత్ర
- భక్తిశ్రద్ధలతో సువర్ణపుష్పార్చన, సుందరాకాండ పారాయణం, దీపోత్సవం
- అయోధ్య ఆలయ ప్రతిష్ఠ నేపథ్యంలో ప్రత్యేక పూజలు

భద్రాచలం, జనవరి 22: అయోధ్యలో బాల రాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ నిర్వహించే వేళ దక్షిణ అయోధ్యగా విరాజిల్లుతున్న భద్రాద్రి రామక్షేత్రం రామనామ స్మరణతో మార్మోగింది. ముందుగా శ్రీ సీతారామచంద్రస్వామి మూర్తులకు సవర్ణ పుష్పార్చన నిర్వహించారు. అనంతరం శ్రీరామరథంతో శోభ యాత్ర నిర్వహించారు. ఉదయం నుంచి రాత్రి వరకు ప్రత్యేక కార్యక్రమాలను దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ క్రమంలో సంక్షేప రామాయణ హవనం, సుందరాకాండ పారాయణం నిర్వహించారు. ఈ సందర్భంగా భద్రాచలానికి చెందిన దారా ముక్తేశ్వర్ అయోధ్య నమూనా ఆలయాన్ని రూపొందించగా దాని ముందు మహిళలు పారాయణ కార్యక్రమాన్ని నిర్వహించారు. రాత్రి ఆలయ ప్రాంగణంలో దీపోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులకు నిరాటంకంగా బెల్లం పొంగలి ప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఇదిలా ఉండగా మాజీ ఎంపీ వి.హనుమంతరావు, మాజీ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్‌రెడ్డి, బీజేపీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు రంగా కిరణ్‌లు భద్రాద్రి రామయ్యను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో భద్రాద్రి దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి, ఏఈవోలు భవానీ రామకృష్ణారావు, శ్రావణ్‌కుమార్, ఈఈ వి.రవీంద్రనాథ, స్థానాచార్యులు కేఈ స్థలశాయి, ప్రధాన అర్చకులు పొడిచేటి సీతారామానుజాచార్యులు, అమరవాది విజయరాఘవన్‌లు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా అయోధ్యలో పూజలు, భద్రాద్రిలో శోభయాత్రను పురస్కరించుకొని భారీగా పోలీసుబందోబస్తు ఏర్పాటు చేశారు.


ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన ఏపీలోని పశ్చిమగోదావరి జిల్లా పురుషోత్తపల్లికి చెందిన మహిళ భక్త బృందం వాయిద్య విన్యాసం


భద్రాద్రిలో శోభయాత్ర దృశ్యం

నెలరోజుల్లో మళ్లీ వచ్చి రివ్యూ చేస్తా

- మీ తప్పులు మీరే సరిదిద్దుకోండి
- అక్రమ భూ రిజిస్ట్రేషన్లు సక్రమం కావాలి
- రఘునాథపాలెం సమీక్షలో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల


సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

రఘునాథపాలెం, జనవరి 22: "నెల రోజుల్లో మళ్లీ ఇక్కడకే వచ్చి రివ్యూ చేస్తా.. ఇప్పటి వరకు మీరు చేసిన తప్పిదాలు ఉంటే వాటిని మీరే సరిదిద్దుకోండి.. ముఖ్యంగా అక్రమ భూ రిజిస్ట్రేషన్లను సక్రమమైన వారికి మార్చాలి" అంటూ వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. రఘునాథపాలెం తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్థానిక మండల అధికారులతో మంత్రి తుమ్మల సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో నిలిచిపోయిన అభివృద్ధి పనులు, కొత్తగా చేపట్టాల్సిన పనుల వివరాలతో సమగ్ర ప్రణాళిక రూపొందించాలన్నారు. గ్రామాల నుంచి మండలస్థాయి వరకు పురాతన, శిథిలమైన భవనాలను గుర్తించాలని, శిథిలావస్థలోకి వెళ్లిన ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతిగృహాల భవనాలను పరిశీలించి నివేదికలను ఇవ్వాలని ఆదేశించారు. అనంతరం కోయచెలకలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ కష్టపడిన ప్రతి కార్యకర్తకు న్యాయం జరుగుతుందన్నారు. గ్రామ పెద్దలు కోరినట్లు అభివృద్ధి జరుగుతుందన్నారు. సమావేశంలో మాదంశెట్టి హనుమంతరావు, ఉప సర్పంచ్ చెరుకూరి పూర్ణచంద్రరావు, చెరుకూరి ముత్తయ్య, చెరుకూరి సీతారాములు, బలుసుపాటి నాగేశ్వరరావు, మాదంశెట్టి సీతారాములు, తోట పుల్లయ్య, వెంకటేశ్వర్లు, అమరం అప్పారావు, వెంకటేశ్వర్లు బలుసుపాటి శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

యాసంగిలో సగానికి తగ్గిన సాగు

- వర్షాభావం, సాగర్ జలాలు రాకపోవడంతో బీళ్లుగా భూములు
- బోర్లు, బావుల్లోనూ తగ్గిపోయిన భూగర్భ జలాలు


ఎండిన సాగర్ ఎడమకాలువ

ఖమ్మం, జనవరి 22(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఈ ఏడాది కృష్ణాపరివాహకప్రాంతంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులతో సాగర్ డ్యాం నిండకపోవడంతో యాసంగి ఎన్నెస్పీ ఆయకట్టులో సాగు సగానికి తగ్గింది. ప్రస్తుతం పాలేరు రిజర్వాయర్ వద్ద 13అడుగులకే నీటి మట్టం ఉండడంతో తాగునీటి అవసరాలకే కృష్ణాజలాలు పరిమితం అవుతున్నాయి. యాసంగి పంట అవసరాలకు నీరు ఇవ్వలేమని చెప్పడంతో రైతులు బోర్లు, బావులు, చెరువుల కింద మాత్రమే యాసంగి సాగుచేస్తున్నారు దీంతో యాసంగి దిగుబడులు కూడా గణనీయంగా తగ్గనున్నాయి. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది అన్ని పంటలపై సాగర్ నీటి కొరత ప్రభావం పడింది. వరి సుమారు రెండున్నరలక్షల ఎకరాల్లో సాగు చేయాల్సి ఉండగా మొత్తం 39,963ఎకరాల్లోనే సాగుచేస్తున్నారు. ఇది కూడా బోర్లు, బావులు ఉన్నచోటే సాగవుతోంది. ఇందులో 3,551ఎకరాల్లో వరి కరివేద సాగు చేశారు. కనీసం 1,08,601 ఎకరాల్లో యాసంగి వరినాట్లు పడతాయని భావించినా ఆ పరిస్థితి కనిపించడంలేదు. ఇప్పటికే సాగర్ ఆయకట్టులోని బోర్లు, బావుల్లో నీటిమట్టం గణనీయంగా తగ్గుతోంది. మొక్కజొన్న 45,069 ఎకరాల్లో సాగు చేశారు. వాస్తవానికి యాసంగిసాగు కింద జిల్లాలో ఏటా 80నుంచి 90వేల ఎకరాలపైగా మొక్కజొన్న సాగవుతోంది. నీటి సమస్య ఉండడంతో మొక్కజొన్న సాగు కూడా సగానికి సగం తగ్గింది. పెసర 4757, మినిములు 581, శనగ 69, కంది 70 ఎకరాల్లో రైతులు వేశారు. మొత్తంమీద ఇప్పటి వరకు యాసంగి సాగుకింద 91వేల ఎకరాల్లో పంటలతో పాటు పండ్ల తోటలు వేశారు. పప్పుధాన్యాల సాగుకూడా గణనీయంగా తగ్గింది. సీతారామ ప్రాజెక్టు పూర్తయితే సాగర్‌లో నీరు లేకపోయినా జిల్లాలో రెండు పంటలు పుష్కలంగా పడే అవకాశం ఉంది.



మల్చింగ్ విధానంలో సాగవుతున్న పచ్చతోట

మెట్ట పంటలకు వరం
ప్లాస్టిక్ మల్చింగ్

« కలుపు సమస్యను నివారించొచ్చు « కూలీల కొరతను అధిగమించొచ్చు
« వర్షాల వేళ నేలకోతనూ నియంత్రించొచ్చు « అధిక దిగుబడికి ఆస్కారం
« మల్చింగ్ విధానంపై ఉమ్మడి జిల్లా రైతుల ఆసక్తి

ఖమ్మం వ్యవసాయం, జనవరి 22: ఉద్యాన పంటలు, కూరగా యల సాగులో వివిధ సమస్యలను అధిగమించడంతో పాటు మంచి దిగుబడులు సాధించాలంటే ఎప్పటికప్పుడు కొత్త పద్ధతులను అవలంబించాలి. మెరక భూముల్లో పంటలను సాగుచేస్తే కలుపు సమస్య తీవ్రంగా ఉంటుంది. సాగునీరు పెట్టిన ప్రతిసారీ కలుపు మొక్కలు పెరుగుతుం డడంతో వాటిని తొలగించడం కష్టంగా మారుతుంది. ఒక్కోసారి కూలీలు అందుబాటులో ఉండరు. ఆర్థిక భారం కూడా పెరుగుతుంది. కలుపు నివారణతోపాటు భూమిలో తేమ శాతం ఎక్కువరోజులు ఉండేలా మల్చింగ్ విధానం ఎంతో దోహదపడుతుంది. దీంతో రైతుకు ఆర్థికభారం తగ్గడంతో పాటు పంట దిగుబడి కూడా పెరుగుతుంది.

మల్చింగ్ విధానంలో పంటలు సాగు చేయడం వల్ల రైతులకు కలుపు నివారణ మందులు చల్లడం, కలుపు తీయడం వంటి ఎలాంటి ఖర్చులుండవు. ఒక ఎకరంలో మల్చింగ్ పద్ధతిలో పంటలను సాగు చేసేందుకు సుమారు రూ.12వేల వరకు ఖర్చవుతుంది. ఆ తర్వాత విత్తనాలు విత్తిన నాటిన నుంచి పూర్తిగా పంట ఎండిపోయే వరకు ఎలాంటి కలుపు నివారణ పనులు చేయాల్సిన అవసరం లేదు. రైతులు మామూలుగా పండించే పంటల కంటే మల్చింగ్ పద్ధతితో 30 శాతం అధికంగా సాగు చేసుకోవచ్చని ఉద్యాన శాఖాధికారులు చెబుతున్నారు.

విధానం..

ఈ పద్ధతిలో 25, 60, 50, 75, 100 మైక్రాన్ల మందం కలిగిన ప్లాస్టిక్ షీట్‌ను పూలు, పండ్ల తోటలతో పాటు కూరగాయల మొక్కల పొరలు బోదెలపై కప్పి ఉంచాలి. పండ్ల తోటలకు 75 నుంచి 100 మైక్రాన్లు, పూలు, పండ్ల తోటలు ఇతర స్వల్పకాలిక పంట లకు 25, 30, 50 మైక్రాన్ల షీట్లను వినియోగిస్తారు. ఈ పద్ధతిలో సాగు చేసేందుకు హెక్టారుకు రూ.35 వేలు ఖర్చ వుతుంది. పంటలను సాగు చేసుకునేందుకు రైతు పొలం చదును చేసిన తరువాత విత్తనాలు విత్తే సమయంలో మల్చింగ్ కవర్‌ను తీసుకొని ముందుగా పొలంలో ప్రతి మల్చింగ్ కవర్‌కు నాలుగు ఫీట్ల దూరం ఉండే విధంగా ఏర్పాటు చేసుకోవాలి. తర్వాత డ్రిప్ ద్వారా పంటకు నీరు చేరే సమీపంలో విత్తనాన్ని విత్తే ప్రదేశంలో మల్చింగ్ కవర్‌కు చిన్న రంధ్రం ఏర్పాటుచేసి అందులో విత్తనానికి విత్తనానికి మధ్య సుమారు 60 సెంటీమీటర్ల దూరం ఉండేలా విత్తాలి. ఇలా ఏర్పాటు చేసిన మల్చింగ్ కవర్ ద్వారా సుమారు మూడు సార్లు అదే ప్రదేశంలో విత్తనాన్ని విత్తుకొని పంటలను సాగు చేసుకోవచ్చు.

ప్రయోజనాలు..

30 నుంచి 80 శాతం సాగుకు నీరు ఆదా అవుతుంది. 70 నుంచి 90 శాతం కలుపు మొక్కల బెడద తగ్గించుకోవచ్చు. ఎరువులు వృథా కాకుండా సమర్థవంతంగా మొక్కలకు అందుతుంది. కూలీల ఖర్చు తగ్గుతుంది. వేరు భాగంలో అనుకూలమైన వాతావరణం పెంచి వేరు వ్యవస్థ వృద్ధికి తోడ్పడుతుంది. వర్షాల కారణంగా మట్టి కొట్టుకుపోకుండా కాపాడుతుంది. విత్తనం మొలకెత్తేందుకు అనుకూలమైన వాతావరణం పెంచుతుంది

మల్చింగ్ అంటే..

మొక్కల చుట్టూ వేర్ల దగ్గర మట్టిని ఏదైనా పదార్థంతో కప్పి పెట్టడాన్ని మ ల్చింగ్ అంటారు. ఎండు గడ్డి, ఎండిన ఆకులు, ఊక, వరి, రంపపుపొట్టును ఉప యోగించి సహజసిద్ధమైన విధానంతో కూడా మల్చింగ్ చేస్తారు. కృత్రిమంగా తయా రు చేసే ప్లాస్టిక్ షీట్‌తోనూ మల్చింగ్ చేయొచ్చు. ఈ పద్ధతులతో భూ మిలోని తేమను సంరక్షించడంతోపాటు కలుపు నివారణ, నేల కోతకు గురికాకుండా కాపాడుకోవచ్చు. మల్చింగ్ విధానంలో రసాయన ఎరువులు, సస్యరక్షణకు అయ్యే ఖర్చును 25 శాతానికి పైగా ఆదా చేసుకోవచ్చు.

మల్చింగ్ వేసే విధానం..

మొక్కకు ఇరువైపులా 5-10 సెంటీమీటర్ల లోతులో నాగలితో సాలు దున్నాలి. కావాల్సిన సైజులో మల్చింగ్ షీట్‌ను కత్తిరించుకోవాలి. దీనిని ప్రతి వరుస మీద బిగుతుగా, ఇరువైపులా నాగలి సాలులోకి పోయేలా ఏర్పాటుచేసుకొని మట్టితో అంచులను కప్పి వేయాలి. షీట్‌ను మరీ బలంగా లాగొద్దు. ఉదయం లేదా సాయంత్రం వేళల్లో మాత్రమే షీట వేసుకోవాలి. విత్తకముందే మల్చింగ్ షీట్ వే యాలనుకుంటే మొక్కల మధ్య దూరాన్ని బట్టి ముందుగానే రంధ్రాలు చేసు కోవాలి. కలుపు సమస్య చాలా తక్కువ..


మల్చింగ్ విధానంలో సాగవుతున్న టమాటా


మార్కెట్‌కు అమ్మకానికి వచ్చిన మిర్చి బస్తాలు

ఖమ్మం మార్కెట్‌కు పోటెత్తిన మిర్చి

ఈ సీజన్‌లో తొలిసారిగా 35 వేల బస్తాల రాక

ఖమ్మం మార్కెట్, జనవరి 22: ఖమ్మం నగరంలోని వ్యవసాయ మార్కెట్‌కు ఎర్రబంగారం (మిర్చి) పోటెత్తింది. సోమవారం సుమారు 35 వేల మిర్చి బస్తాలు అమ్మకానికి వచ్చాయి. శని, ఆదివారాలు వరుసగా రెండు రోజుల సెలవుల అనంతరం సోమవారం మార్కెట్‌లో తిరిగి కొనుగోళ్లు ప్రారంభం కావడంతో రైతులు భారీగా పంటను తీసుకొచ్చారు. కొత్త మిర్చి ప్రారంభమైనాక ఈ సీజన్‌లో తొలిసారిగా పంట ఇంత భారీగా రావడం ఇదే ప్రథమం. మార్కెట్‌కు వారం రోజుల క్రితం వరకు రోజుకు 25 వేల నుంచి 27 వేల బస్తాలు వస్తుండగా, సోమవారం ఒక్కసారిగా 35 వేల బస్తాలకు పైగా అమ్మకానికి రావడం విశేషం. కాగా మార్కెట్‌లో తేజా రకం డీలక్స్ ఎండు మిరపను క్వింటాల్ రూ. 20,500 ల జెండా పాట ధర నిర్ణయించగా వ్యాపారులు నాణ్యతను బట్టి క్వింటాల్ కనిష్ఠంగా రూ. 13,500 లకు కొనుగోలు చేయగా నమూనా రకాలను క్వింటాలు రూ. 18,000 లకు కొనుగోలు చేశారు. తాలు మిర్చి సైతం రకాలను బట్టి క్వింటాలు రూ. 6,000 లనుంచి 11,500 ల వరకు కొనుగోలు చేయగా పత్తి క్వింటాలు రూ. 6,000 ల నుంచి రూ. 6,701 వరకు పలికింది. మిర్చి కొనుగోళ్లను మార్కెట్ ఇన్‌చార్జ్ సెక్రటరీ భూక్యా బజారు, వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులు, మార్కెట్ సిబ్బంది తదితరులు సమీక్షించారు.


రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

రాష్ట్రస్థాయి సైన్స్‌ఫేర్‌కు ఏన్కూరు విద్యార్థులు

ఏన్కూరు, జనవరి 22: రాష్ట్రస్థాయి సైన్స్‌ఫేర్ పోటీలకు ఏన్కూరు, బురద రాఘవాపురం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలల విద్యార్థులు ఎంపికయ్యారు. ఈనెల 18,19 తేదీలలో జిల్లాస్థాయి సైన్స్‌ఫేర్ పోటీలను ఆన్‌లైన్‌లో నిర్వహించారు. ఈపోటీల్లో ఏన్కూరు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని పోతిన్ని సాయిసింధూర ఆరోగ్యం అనే ఉప అంశంలో చేసిన ప్రయోగం రాష్ట్రస్థాయికి ఎంపికైంది. అదేవిధంగా బురద రాఘవాపురం ఉన్నత పాఠశాలకు చెందిన బర్రోత్ నవదీప్ అనే విద్యార్థి వ్యవసా యరంగం విభాగం నుంచి రైతు పాము కాటు గురికాకుండా కాపాడడం అనే అంశంపై చేసిన ప్రదర్శన జిల్లా స్థాయిలో మొదటి బహుమతి సాధించి రాష్ట్రస్థాయికి ఎంపిక య్యాడు. వీరు ఇరువురు విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. గైడ్ టీచ ర్లుగా వ్యవహరించిన భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు పొట్ట రామారావు, జీవశాస్త్ర ఉపాధ్యాయురాలు సాగి సుజాతను హెచ్‌ఎంలు శ్రీనివాస్, కూరాకుల సైదయ్య ప్రత్యేకంగా అభినందించారు.

నాణ్యమైన బియ్యాన్ని లబ్ధిదారులకు అందించాలి

ఈకేవైసీకి నెలాఖరు వరకు గడువు .. చౌకదుకాణ డీలర్లతో డీఎస్వో

ఖమ్మం కలెక్టరేట్, జనవరి 22: మండల స్థాయి గోదాం కేంద్రం (ఎంఎల్ఎస్ పాయింట్) నుంచి నాణ్యత ప్రమాణాలను పరిశీలించుకుని మంచి బియ్యాన్ని లబ్ధిదారులకు అందించాలని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి చందన్‌కుమార్ అన్నారు. సోమవారం చౌకదుకాణాల డీలర్లతో ఆయన సమీక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఆహార భద్రతా లబ్ధిదారులకు నాణ్యమైన బియ్యాన్ని పంపిణీ చేయాలన్నది లక్ష్యమన్నారు. దీనితో పాటు ఈ కేవైసీపై ఆయన సమీక్షించారు. జిల్లా వ్యాప్తంగా 73శాతం లబ్ధిదారులు ఈ కేవైసీ పూర్తి చేసుకున్నారని ఇంకా మిగిలిన 27 శాతం మంది లబ్ధిదారులు కూడా ఈ నెలాఖరు నాటికి ఈకేవైసీ పూర్తి చేయించుకోవాలన్నారు. దీనికోసం వారికి అవగాహన కల్పించాలని డీలర్లకు సూచించారు. ఈ సమావేశంలో డీలర్లు ఆనోత్ వెంకన్న, జానిమియా, ఇబ్రహీం తదిరులు డిప్యూటీ తహసీల్దార్ సురేందర్, ఆర్ఐలు పాల్గొన్నారు.

నేడు కేడీసీలో అతిథి అధ్యాపక పోస్టులకు ఇంటర్వ్యూలు

కేయూ క్యాంపస్, జనవరి 22 : హనుమకొండ కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ అప్లికేషన్, మైక్రో బయాలజీ సబ్జెక్టుల్లో ఒక్కో పోస్టుకు అతిథి అధ్యాపకులుగా పనిచేసేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.రాజిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పీజీలో 55 శాతం మార్కులతో పాటు నెట్, స్లెట్, పీహెచ్‌డీ కలిగిన వారికి ఎంపికలో ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. అభ్యర్థులు జనవరి 23న మంగళవారం ఉదయం 11 గంటలకు ధృవప త్రాలతో పాటు ఒక సెట్ జిరాక్స్ పత్రాలతో ఇంటర్వ్యూలకు హాజరు కావాలని కోరారు.

30 నుంచి ఇంజనీరింగ్ మొదటి సెమిస్టర్ పరీక్షలు

కేయూ క్యాంపస్, జనవరి 22 : కాకతీయ యూనివర్సిటీ పరిధిలో జనవరి 30 నుంచి ఇంజనీరింగ్ మొదటి ఏడాది మొదటి సెమిస్టర్ పరీక్షలు నిర్వహిస్తామని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ చాడ రాధికారెడ్డిలు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి 30, ఫిబ్రవరి 1, 3, 6 ,8 తేదీల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని తులిపారు. బీటెక్ (సీబీసీఎస్) మొదటి ఏడాది మొదటి సెమిస్టర్ రెగ్యూలర్, సప్లిమెంటరీ అభ్యర్థులందరూ పరీక్షలకు హాజరుకావాలని కోరారు. కేయూ క్యాంపస్ కో ఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ కళాశాల, కేయూ క్యాంపస్ మహిళ ఇంజనీరింగ్ కళాశాల, మంచిర్యాల ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో పరీక్షల కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగికి మొబైల్ ఫోన్ అందజేత

కొత్తగూడెం క్రైం, జనవరి 22: కొత్తగూడెం ఆర్టీసీ డిపోలో డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్న ఉద్యోగి రమణయ్య రెండ్రోజుల క్రితం మొబైల్ ఫోనును పోగొట్టుకొని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వన్‌టౌన్ పోలీస్‌లు దర్యాప్తు చేయగా ఆ మొబైల్ ఫోన్ బస్టాండ్ ఆవరణలో దొరికింది. ఫిర్యాదుదారుడు రమణయ్యను పిలిపించి వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ కరుణాకర్ మొబైల్ ఫోన్‌ను అప్పగించారు.

కారు ఢీకొని మూడేళ్ల బాలుడి దుర్మరణం

టేకులపల్లి, జనవరి 22: కారు ఢీకొని మూడేళ్ల బాలుడు మృతి చెందాడు. ఈసంఘటన మండలంలోని కోయగూడెం పంచాయతీ బావోజీతండాలో సోమవారం జరిగింది. ఈ ఘటనలో బావోజీతండాకు చెందిన మూడేళ్ల బాలుడు అజ్మీర సిద్ధార్థ నాయక్ మృతి చెందాడు. టేకులపల్లి పోలీసుల కథనం ప్రకారం బావోజీతండాకు చెందిన అజ్మీర విక్రమ్, మాధవి దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉంది. ఇద్దరి కుమారుల్లో చిన్నావాడు సిద్ధార్థనాయక్ ఇంటిముందు రోడ్డు పక్కన ఆటలాడుకొంటుండగా అదే గ్రామానికి చెందిన అజ్మీర సుమన్ నిర్లక్ష్యంగా, అతివేగంగా కారు నడిపి మూడేళ్ల బాలుడిని ఢీకొట్టాడు. బాలుడికి తీవ్రగాయాలై రక్తస్రావం కావడంతో కొత్తగూడెం ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లగా వైద్యులు పరీక్షించి బాలుడు మృతి చెందినట్లు నిర్ధారించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు టేకులపల్లి ఎస్సై రమణారెడ్డి తెలిపారు.


మృతి చెందిన సిద్ధార్థ నాయక్

దుమ్ము, ధూళి.. ప్రజారోగ్యం బలి

« కాలుష్య కాసారంగా సత్తుపల్లి శివారు ప్రాంతం « కిష్టారం బొగ్గు లారీల నుంచి దుమ్ముధూళి
« సమీపంలోని చెట్లల్లో ఎదుగుదల లోపం, వాహనదారులు ఉక్కిరిబిక్కిరి



దుమ్మూధూళికి కారణమవుతున్న కిష్టారం ఓసీ ప్రవేశ ప్రాంతం ఇదే, ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న అంబేద్కర్ నగర్ వాసులు

సత్తుపల్లిరూరల్, జనవరి 22: అది జాతీయ రహదారి.. నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. రహదారి వెంట ఉన్న చెట్లకు దుమ్మూధూళి అంటుకుని పర్యావరణ కాలుష్యానికి కారకామవుతున్నాయి. అయితే ఈ కాలుష్యం కాస్తా సింగరే ణి బొగ్గు లారీల మూలంగా ఎక్కువ మొత్తంలో పెరిగిపోతుంది. కాలుష్యం కోరల్లో చెట్లు ఉంటే ఆ సమయంలో అటూఇటూ వెళ్లే వాహనదారుల పరిస్థితి దారుణంగా ఉంటున్నది. సత్తుపల్లి పట్టణ శివారు దాటిన వెంగళరావునగర్, కిష్టారం వై-జంక్షన్, ఆ తర్వాత కిష్టారం గ్రామంలోని ప్రధాన సెంటర్‌తోపాటు అంబేద్కర్ నగర్ తదితర ప్రాంతాలలో కాలుష్యం పరిమితి దాటిపోతోందని ప్రజలు, వాహనదారులు ఆరోపిస్తున్నారు.

కిష్టారం ఓసీ లారీల మూలంగానే...

కిష్టారం ఓసీ నుంచి బయటకు బొగ్గు లోడ్‌తో వచ్చే లారీలు రక్షణ చర్యలు తీసుకోకపోవడంతో పొడి మొత్తం వచ్చేపోయే వాహనాలతో పాటు జాతీయ రహదారికి ఇరువైపులా ఉన్న చెట్లకు అంటుకుని నల్లగా మారుతున్నాయి. దీంతో కాలుష్యానికి పెద్ద పెద్ద వృక్షాలు మారే చెట్లు ఎదుగుదల లేక ఎండిపోతున్నాయి. రహదారి వెంట నీడనివ్వడంతో పాటు మానవాళికి ఆక్సిజన్ అందించే చెట్లు ఇలా కాలుష్యానికి గురవ్వడంతో వాతావరణంలో అసమతౌల్యం ఏర్పడుతున్నట్లు పర్యావరణ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఎమ్మెల్యే రాగమయికి వినతి

సింగరేణి కాలుష్యం కోరల్లో చిక్కుకున్న మండలంలోని కిష్టారం గ్రామాన్ని కాపాడాలంటూ అంబేద్కర్ నగర్‌కు చెందిన కొందరు సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. సైలో బంకర్ (ట్రైన్ లోడింగ్ పాయింట్) నుంచి బొగ్గు దుమారం లేచి ప్రజలంతా తీవ్ర అనారోగ్యాలకు గురవతున్నారని, కిష్టారం ఓసీ వద్ద నుంచి బొగ్గు లారీలు పట్టాలు కప్పుకుని రాకపోవడంతో బొగ్గు దూళి లేచి తీవ్ర ఇబ్బందులకు గురతున్నట్లు విన్నవించారు. సింగరేణి అధికారులతో మాట్లాడి నివారణ చర్యలు తక్షణమే తీసుకోవాలని కోరనున్నట్లు ఆమె హామీ ఇచ్చారు.

344 ఆక్రమణలు తొలగించండి

కలెక్టర్, కార్పొరేషన్ కార్యాలయాల్లో స్థానికులు వినతి
ఆక్రమణ, నిర్మాణ విషయం మంత్రి తుమ్మల దృష్టికి

ఖమ్మం, జనవరి22(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలోని 344 సర్వే నెంబరులోని ప్రభుత్వ భూమిలో ఆక్రమణలు తొలగించాలని స్థానికులు కొందరు జిల్లా కలెక్టర్, ఖమ్మం కార్పోరేషన్ కార్యాలయాల్లో జరిగిన గ్రీవెన్స్‌లలో వినతిపత్రాలు అందించారు. గతంలో సదరు సర్వే నెంబరులో పేదలు ఉండగా.. ఓ బీఆర్ఎస్ నాయకుడు ఆయన భాగస్వామిగా ఉన్న మరో వ్యక్తి ప్రభుత్వ భూమి అని చెప్పి వారిని అక్కడి నుంచి ఖాళీ చేయించారని, అనంతరం వారే ఆ సర్వే నెంబరులోని ప్రభుత్వ భూమిని కబ్జా చేసేందుకు ప్రయత్నాలు చేశారనీ వినతి పత్రంలో పేర్కొన్నారు. ఆ సమయంలో తాము అడ్డుకోవడంతో అది నిలిచిపోయిందనీ, తాజాగా మళ్లీ పక్కన ఉన్న సర్వే నెంబరు పేరుతో అపార్ట్‌మెంట్ల నిర్మాణానికి అనుమతులు తీసుకుని 344లో ఉన్న ప్రభుత్వ భూమిలో నిర్మాణాలు చేస్తున్నారనీ వారు తెలిపారు. వారు అనుమతులు పొందిన పత్రాల లింకు డాక్యుమెంట్లను పరిశీలిస్తే ఆ డాక్యుమెంట్లలో పొందుపర్చిన గూగుల్ లోకేషన్ సైతం 344 సర్వే నెంబరులో చూపిస్తుందన్నారు. అధికారులు స్పందించి దానిపై పూర్తి విచారణ జరిపి ఆక్రమణను తొలగించాలని, ఉద్దేశ్యపూర్వకంగా తప్పుడు అనుమతులు రద్దు చేయాలని వారు కోరారు. కాగా ఈ విషయాన్ని వారు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం.

ఆంధ్రా సరిహద్దులో.. గోవిందాపురం వ్యథ

సాగునీటి కాల్వలు పొరుగు రాష్ట్రంలో .. నీరు అందక అన్నదాతల కష్టాలు
గ్రామాన్ని రెండుగా చీల్చుతున్న రైల్వేగేటు.. యూబీ నిర్మాణంలో రైల్వే శాఖ నిర్లక్ష్యం


అలంకారప్రాయంగా తాగునీటి ట్యాంకు

బోనకల్, జనవరి 22: ఆంధ్రా సరిహద్దుకు దగ్గరలో ఉన్న చిన్న గ్రామం అది. ఆ ఊరు పేరు గోవిందా పురం(ఎ). సరిహద్దు గ్రామం కావడం.. ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఏళ్లుగా అవే బాధలు ఉండటంతో కొంతమంది వలస వెళ్లారు. వ్యవసాయమే జీవనాధారంగా ఉన్నవారు మాత్రం గ్రామంలోనే ఉంటున్నారు. కష్టాల సాగు చేస్తున్నారు. ఈ గ్రామంలో రైల్వే గేటు ఉన్నందున రెండుగా విడి పోయింది. గ్రామం నుంచి బయటకు వెళ్లాలంటే గంటల తరబడి వేచి ఉండాల్సిందే. ప్రాణాపాయ పరిస్థితుల్లో వైద్యం కోసం బయటకు వెళ్లేందుకు నరకం చూస్తున్నారు. ఈ సమస్యను అధిగమించేందుకు అండర్ బ్రిడ్జిని ఏర్పాటు చేయాలని ప్రజలు రైల్వేశాఖకు మొరపెట్టుకున్నా ఉపయోగం లేకుండాపోయింది. మిషన్ భగీరథ పథకం ద్వార గ్రామానికి తాగునీటిని అందించే పైపులైన్లు కొత్తవి వేయలేదు. గతంలో ఉన్న బోడేపుడి సుజల స్రవంతి పథకం పైపులైన్‌నే ప్రస్తుతం ఉపయోగించడంతో నీరు సక్రమంగా అందడం లేదు. గ్రామంలో ఉన్న ప్రాథమిక, అంగన్‌వాడీ పాఠశాల, కమ్యూనిటీ హాల్ భవనాలు శిథిలావస్థలో ఉన్నాయి. గ్రామం మోట మర్రి సొసైటీలో అంతర్భాగం కావడంతో రైతులు ఎరువులు, విత్తనాలు, ధాన్యం అమ్మకాలకు 6 కిలో మీటర్ల దూరం వెళ్లాల్సి వస్తోంది. గ్రామం నుంచి 800 మీటర్ల దూరం బీటీ వేస్తే ఆంధ్రా ప్రాంతానికి చేరుకోవచ్చు. రెండు ప్రాంతాల ప్రజల రాకపోకలకు సౌకర్యంగా ఉంటుంది. ప్రస్తుతం గ్రామంలో జరుగుతున్న మూడో దశ రైల్వేలైన్ పనుల వల్ల ఆళ్లపాడు నుంచి గోవిందాపురం వరకు ఉన్న రహదారి పూర్తిగా దెబ్బతింది. గ్రామ రెవెన్యూ పరిధిలో గల పొలాలకు నీరును సరఫరా చేసే కాలువలు ఆంధ్రా ప్రాంతంలో ఉండ టంలో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ గ్రామంలో మెజార్టీ ప్రజలు గుడిసెల్లోనే కాలం వెళ్లదీస్తుండటం విశేషం.



గ్రామాన్ని రెండుగా విడగొట్టిన రైల్వేగేటు, ఆంధ్రా సరిహద్దు మార్గానికి బీటీ వేయాల్సిన రోడ్డు ఇదే

దివాళా పిటీషన్ దాఖలు

ఖమ్మం లీగల్, జనవరి 22: వైరాకు చెందిన తిరుమల ఇంజనీరింగ్ యజమాని కొల్లి తిరుమలరావు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఖమ్మం న్యాయస్థానంలో సోమవారం దివాళా పిటీషన్ దాఖలు చేశారు. తిరుమలరావు వైరాలో తిరుమల ఇంజనీరింగ్ పేరుతో ట్రాక్టర్ల రిపేర్లు, వ్యయసాయ పరికరాల తయారీ, అమ్మకం వ్యాపారం చేసేవాడు. ఈ వ్యాపారాన్ని అభివృద్ధి చేసేందుకు మొత్తం 13 మంది దగ్గర రూ.86 లక్షలు అప్పుగా తీసుకొన్నాడు.వ్యాపారంలో ఒడుదుడుకులు రావటం, వ్యాపారం సరిగ్గా నడవక అప్పులు ఇచ్చినవారి దగ్గరి నుంచి ఒత్తిడి అధికమైంది. మొత్తం 13 మంది ప్రతివాదులపై దివాళా పిటిషన్ ను తమ న్యాయవా దులు అయిన చింతనిప్పు వెంకట్, సాయిరాజీవ్ ద్వారా ఖమ్మం ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జికోర్టులో దాఖలు చేశారు.

32 లీటర్ల నాటుసారా పట్టివేత

దుమ్ముగూడెం, జనవరి 22: చినబండిరేవు వద్ద సోమవారం రూ.12,800ల విలువగల 32 లీటర్ల నాటుసారా పోలీసులకు పట్టుబడింది. సుజ్ఞానపురంకు చెందిన భూక్యా వీరు, భూక్యా శ్రీకాంత్‌లు ద్విచక్రవాహనంపై నాటుసారాను రవాణా చేస్తూ పోలీసు వాహన తనిఖీల్లో దొరికారు. వారి వద్ద నుంచి ద్విచక్రవాహనం, నాటుసారాను స్వాధీనం చేసుకోవడంతోపాటు ఇద్దరు నిందితుల్ని అదుపులోకి తీసుకున్నారు. ఎస్ఐ కేశవరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అదృశ్యమైన విద్యార్థి ఆచూకీ లభ్యం

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, జనవరి 22: కొత్తగూడెంలో ఇటీవల అదృశ్యమైన పదవ తరగతి విద్యార్థి రిమాలి ఉషోదయ అక్షయ్‌కుమార్ ఆచూకీ లభించింది. కొత్తగూడెం వన్ టౌన్ పోలీసులు సోమ వారం ఆ విద్యార్థిని గుర్తించారు. ఈ నెల 19న పదవ తరగతి అక్షయ్‌కుమార్ అదృశ్యమయ్యాడు. అదృశ్యమైన విద్యార్థి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పో లీసులు గాలింపు చర్యలు చేపట్టగా ఖమ్మం బస్టాండ్ ఆవరణలో ఒక్కడే ఉండటాన్ని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. విచారణ చేసిన అనంతరం పాత కొ త్తగూడెంలో జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పదవతరగతి చదువుతున్నట్లుగా నిర్ధారించుకొని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు తీసుకు వచ్చారు. ఫిర్యాదుదారుడు తండ్రి అగస్టీన్‌కు పోలీసులు సమాచారం అందించి అతడిని పోలీస్ స్టేషన్‌కు పిలిపించి విద్యార్థిని తండ్రికి అప్పగించారు. కేసును త్వరితగతిన చేధించిన వన్‌టౌన్ ఎస్సై విజయలక్ష్మి, హెడ్‌కానిస్టేబుల్ గనిని వన్‌టౌన్ ఇ న్స్పెక్టర్ కరుణాకర్, డీఎస్పీ రెహమాన్ వీరిని ప్రత్యేకంగా అభినందించారు.

కేసు విషయంలో రాజీకి పిలిచి దాడి

చికిత్స పొందుతూ యువకుడి మృతి

ఖమ్మం క్రైం, జనవరి 22: పాత కేసు విషయంలో రాజీకి రావాలని పిలిచి ఓ యువకుడిపై ఓ వ్యక్తి దాడి చేయటంతో చికిత్స పొం దుతూ మరణించాడు. ఈ సం ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఖమ్మం వన్‌టౌన్ పోలీసులు సోమవారం తెలిపిన వివరాల ప్రకారం నగరంలోని టీకే బజార్‌కు చెందన వడ్డేటిశివ (30) అనే యువకుడు పేయింటింగ్ పనిచేసుకొని జీవ నం కొనసాగిస్తున్నాడు. శివకు గతంలో అదే ప్రాంతానికి చెందిన యువకులతో గొడవ జరిగింది. శివ ఫిర్యాదు మేరకు గతంలో పోలీసులు కేసు నమోదు చేశారు. ప్ర స్తుతం కేసు న్యాయస్థానంలో విచారణలో ఉంది. అయి తే ఆ కేసు విషయంలో ఆదివారం ఉల్లోజు నాగరాజు అ నే వ్యక్తి సమక్షంలో పంచాయితీ నిర్వహించి రాజీ పడా లని సూచించారు. దీంతో శివ రాజీ పడే ప్రసక్తేలేదని స్పష్టం చేయటంతో ఆగ్రహానికి గురైన నాగరాజు బల మైన కర్రతో మృతుడు శివపై దాడికి పాల్పడ్డాడు. దీంతో తీవ్ర గాయలైన శివను వెంటనే చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. ఈ సంఘటనపై మృతు డి తండ్రి వడ్డేటి నారాయణ ఫిర్యాదుపై వన్‌టౌన్ సీఐ స్వామి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సరుకు తీసుకుని డబ్బులు ఇవ్వడం లేదు

గుజరాత్ వ్యాపారులపై సీపీకి ఫిర్యాదు


సీపీకి వినతిపత్రం అందజేస్తున్న నల్లమల ఆనంద్

ఖమ్మం వ్యవసాయం, జనవరి 22: మార్కెట్‌లో క్రయ విక్రయాలు సజా వుగా జరగకుండా గుజరాత్ వ్యాపారులు డబ్బులు చెల్లించకుండా ఇబ్బం దులు పెడుతున్నారని వర్తకసంఘం ఎగుమతి శాఖ అధ్యక్షుడు నల్లమల ఆనంద్ ఆధ్వర్యంలో పోలీస్ కమిషనర్ సునీల్ దత్‌కు విన్నవించారు. సోమవారం సీపీ చాంబర్‌లో ఆయనను కలిసి వినతిప త్రం సమర్పించారు. ఖమ్మం మార్కెట్‌లో వ్యాపారుల సరుకులు కొనుగోలు చేసిన గుజరాత్‌కు చెందిన వ్యాపారులు నగర వ్యాపారులకు డబ్బులు ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారని వివరించారు. ప్రతీ సంవత్సరం స్థానిక వ్యాపారులకు సకాలంలో డబ్బులు అందక ఇబ్బందులు కలుగుతున్నాయని వివరించారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి సరుకు కొనుగోలు చేసి డబ్బులు చెల్లించకపోవడంలో వ్యాపారులు చాలా సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తోందని పేర్కొన్నారు. ఈవిషయంపై దృష్టిసారించి తగిన చర్యలు తీసుకోవాలని నల్లమల ఆనంద్ కోరారు. ఈ కార్యక్రమంలో ఎగుమతి శాఖ కార్యదర్శి చెరుకూరి సంతోష్, సభ్యులు భైరిశెట్టి శ్రీను, వ్యాపారులు, చిట్టూరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థినికి పాముకాటు

వైరా, జనవరి 22: వైరాలోని రాష్ట్ర సాంఘీక సంక్షేమ గురుకుల బాలికల జూనియర్ కళాశాలలో సోమవారం రాత్రి ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం విద్యార్థినీ కొంగల ప్రసన్న పాము కాటుకు గురైంది. డైనింగ్ హాల్‌లో భోజనం చేసి వసతి భవనం వద్దకు వెళ్తున్న సమయంలో ప్రసన్నను పాము కాటు వేసింది. వెంటనే అక్కడ ఉన్న ఉపాధ్యాయినీలకు పాటు కాటు వేసిన విషయాన్ని తెలిపింది. హుటాహుటిన వైరాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి ప్రథమ చికిత్స చేయించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం తల్లాడ 108 వాహనంలో ఖమ్మం తరలించారు. ప్రస్తుతం ప్రసన్న ఆరోగ్యం నిలకడగా ఉంది.


పాముకాటుకు గురైన విద్యార్థినిని 108లో చికిత్స కోసం ఖమ్మం ప్రభుత్వాసుపత్రికి తరలిస్తున్న దృశ్యం

WALK - IN - INTERVIEW

ఆంధ్రజ్యోతి దినపత్రికలో పనిచేయుటకు నిరుద్యోగ యువకులకోసం ఈ క్రింది ఉద్యోగ అవకాశాలు కలవు. కాబట్టి అర్హత కలవారు ఇంటర్వ్యూలలకు హాజరుకాగలరు.

ఆంధ్రజ్యోతి

డివిజన్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ (SR)

సత్తుపల్లి, కొత్తగుడెం, భద్రాచలం

అభ్యర్థి తన డివిజన్ పరిధిలోని ఏజెంట్లను, సేల్స్ టీమ్స్‌ను కో-ఆర్డినేషన్ చేస్తూ మంచి రిజల్ట్ వచ్చేవిధంగా పని చేయవలసి ఉంటుంది. అభ్యర్థి కనీస అర్హతఇంటర్ మరియు సేల్స్ రంగంపై ఆసక్తి కలిగి ఉండవలెను. అర్హత, అనుభవాన్ని బట్టి వేతనం నిర్ణయించబడును. పై అర్హతలు గల అభ్యర్థులు ఇంటర్వ్యూకు హాజరుకాగలరు

ఇంటర్వ్యూ తేది: 23-01-2024 ఉ॥ 10:00 నుండి మ॥ 2 గంటలు వరకు

ఇంటర్వ్యూ స్థలము : సర్క్యులేషన్ మేనేజర్
ఆంధ్రజ్యోతి కార్యాలయం.
ఆంధ్రజ్యోతి బిల్డింగ్స్. ప్లాట్స్ నెం: 112,
ఇండస్ట్రియల్ ఏరియా ఖానాపురం హవేలి,
శ్రీ అభయ వేంకటేశ్వరస్వామి గుడి రోడ్డు, ఖమ్మం
సెల్: 9985411350

అంతా రామమయం

కళాకారులతో భద్రాచలం రామాలయం ఈవో రమాదేవి





కల్లూరులో



నేలకొండపల్లిలో రామాయణ దృశ్యం

- ఇరు జిల్లాల్లో మారుమోగిన రామనామం
- ర్యాలీలు, భజనలు, సంకీర్తనలు, ప్రత్యేక పూజలు, అన్నదానాలు

ఖమ్మం సాంస్కృతికం, జనవరి 22: అయోధ్యలో బాలరాముని ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా సోమవారం ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో రామనామం మారుమోగింది. మండల కేంద్రాలతో పాటు గ్రామాలలో ఎటు చూసినా కాషాయ రంగు శ్రీరామ పతాకాలు, కండువాలు రెపరెపలాడాయి. పతాకాలను ధరించిన రామభక్తులు వాడ వాడలా వేడుక నిర్వహించారు. డీజే పాటలతో హోరెత్తిస్తూ పెద్ద సంఖ్యలో జై శ్రీరాం నినాదాలతో తమ భక్తి ప్రపత్తులు చాటారు. అయోధ్యలో రామమందిర నిర్మాణ వందల ఏళ్ల కల ఫలించబోతుండటంతో ఆనంద తాండవం చేశారు. ఈసందర్భంగా భారీ ర్యాలీలు, భజనలు, రామనామ సంకీర్తనలు, అన్నదానాలు ఘనంగా నిర్వహించారు. అయోధ్య రామాలయ ప్రారంభోత్సవ కార్యక్రమం కన్నులారా తిలకించేందుకు రామ భక్తులు ఆసక్తి చూపటంతో పలు చోట్ల భారీ ఎల్‌సీడీ తెరలు ఏర్పాటు చేసి రామాలయ ప్రారంభోత్సవాన్ని ప్రత్యక్ష ప్రసారం ఏర్పాటు చేశారు.



ఖమ్మంలో మార్వాడీలు



అశ్వాపురంలో రామ భక్తులు



బోనకల్‌లో



కూసుమంచి



ఖమ్మం నగరంలో కాషాయ కండువాలతో యువకులు



వైరా ఆర్టీసీ బస్టాండ్‌లో జైశ్రీరామ్ నినాదాలు చేస్తున్న భక్తులు



ఇల్లెందులో అక్షింతలు పంపిణీ చేస్తున్న హిందూ, ముస్లింలు

28న అథ్లెటిక్స్ ఎంపికలు

ఖమ్మం స్పోర్ట్స్, జనవరి 22: జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 28న నగరంలోని సర్దార్‌పటేల్ స్టేడియంలో అండర్- 8, 10, 12 14 బాలురు, బాలికల అథ్లెటిక్స్ ఎంపికలు నిర్వహించనున్నట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి ఎండీ షఫీక్‌అహ్మద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులను జిల్లా జట్టుకు ఎంపికచేసి త్వరలో కొత్తగూడెంలో జరిగే రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ పోటీలకు పంపుతామని తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు తమ జనన ధ్రువీకరణ పత్రంతో ఉదయం 9 గంటలకల్లా స్టేడియానికి చేరుకోవాలని కోరారు.

10, 11వ తేదీల్లో ఖమ్మంలో ప్రజా రచయిత్రుల వేదిక రాష్ట్ర మహాసభలు

ఖమ్మం సాంస్కృతికం, జనవరి 22: ప్రజా రచయిత్రుల వేదిక రాష్ట్ర 7వ మహాసభలకు ఖమ్మం వేదిక కానుంది. ఫిబ్రవరి 10, 11 తేదీల్లో నగరంలోని ఇల్లెందు క్రాస్ రోడ్‌లోని వేదిక ఫంక్షన్ హాల్‌లో ఈసభలు జరుగనున్నాయి. ప్రజా రచయిత్రుల వేదిక ఏర్పడి 15 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా నిర్వహించ బోయే మహాసభల్లో పలు కీలక సాహిత్య అంశాలపై చర్చలు చేయనున్నారు. ఈ కార్యక్రమాల్లో కాత్యాయిని విద్మహే, జాజిమల్లి, అనిశెట్టి రజిత తదితర ప్రముఖ ఫెమినిస్టులు పాల్గొంటారు.

ఎన్‌సీసీ పోటీలో న్యూవిజన్ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల డైరెక్టర్ కార్తీక్

ఖమ్మం స్పోర్ట్స్, జనవరి 22: స్వచ్ఛ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా 11 తెలంగాణ ఎన్‌సీసీ బెటాలియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'వేస్ట్ ది బెస్ట్' పోటీల్లో తమ పాఠశాలకు చెందిన ఎన్‌సీసీ క్యాడెట్లు ఆసిల్ అహ్మద్ ప్రథమ, నందిని ద్వితీయ బహుమతులు సాధించారని పాఠశాల యజమాన్యం తెలిపింది. వీరికి 11ఎన్‌సీసీ బెటాలియన్ కమాండెంట్ లెఫ్టినెంట్ కల్నల్ నవీన్‌యాదవ్ బహుమతులు ప్రదానం చేశారని వారు తెలిపారు. బహుమతులు సాధించిన విద్యార్థులను పాఠశాల డైరెక్టర్ సీహెచ్ కార్తీక్, ప్రిన్సిపాల్ అబాద్ అలీ, ఎన్‌సీసీ శిక్షకులు లింగస్వామి, వాసంతి పలువురు అధ్యాపకులు అభినందించారు. భవిష్యత్ పోటీలలో రాణించి పాఠశాలకు ఖ్యాతిని తీసుకురావాలని ఆకాంక్షించారు.

అక్రమ కట్టడాలపై నోటీసులు జారీ

- విచారణ అనంతరం చర్యలు తీసుకోనున్న అధికారులు

సత్తుపల్లి, జనవరి22: సత్తుపల్లి పట్టణంలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న బహుళ అంతస్థుల భవనాలకు సంబంధించి బిల్డర్లకు మునిసిపల్ అధికారులు నోటీసులు జారీచేశారు. పట్టణంలో పదుల సంఖ్యలో బహుళ అంతస్థుల భవనాలను కొందరు బిల్డర్లు నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన విషయం విధితమే. వీటిలో కొన్ని భవనాలకు సంబంధించి ఇప్పటికే అధికారులకు ఫిర్యాదులు అందడంతో మునిసిపల్ అధికారులు పరిశీలించి నోటీసులు జారీచేశారు. మునిసిపాలిటీ పరిధిలోని లలితకుమారి ఆసుపత్రి రోడ్, వేంసూర్ రోడ్‌తో సహా ఇతర ప్రాంతాలలో నిబంధనలకు మించి నిర్మించిన భవనాల యజమానులు నలుగురికి నోటీసులు జారీచేశారు. తదుపరి విచారణ అనంతరం చర్యలు తీసుకోనున్నట్లు అధికారులు తెలిపారు.

విచ్చలవిడిగా పెంట్‌హౌస్‌ల నిర్మాణం

పట్టణంలో అపార్టుమెంట్లపై పలువురు బిల్డర్లు పెంట్‌హౌస్‌లను నిర్మించి, విక్రయించి పెద్ద మొత్తంలో సొమ్ము చేసుకుంటున్నారు. పెంట్‌హౌస్‌ల నిర్మాణానికి అనుమతులు లేకపోయినా ఇబ్బడిముబ్బడిగా బిల్డర్లు నిర్మిస్తున్నారు. నిర్మాణ సమయంలో నియంత్రించే వారు లేకపోవడంతో వీటిని విక్రయిస్తున్నారు. అనుమతులు లేని పెంట్‌హౌస్‌లను కొనుగోలు చేసిన వారికి రిజిస్ట్రేషన్లు జరిగే అవకాశం లేదు. బ్యాంక్ రుణాలు కూడా అందని పరిస్థితి ఉంది. అనుమతి ఉన్న పోర్షన్ల ధర కంటే పెంట్‌హౌస్ కొంతమేర తక్కువ ధరకు విక్రయిస్తుండటంతో వీటిని కొనుగోలు చేస్తున్నారు. అధికారులు కఠిన చర్యలకు ఉపక్రమిస్తే కొనుగోలు దారులు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉంది. నిర్మాణ దశలోనే అక్రమ కట్టడాలను నియంత్రించాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

శ్రీరామనవమి నేపథ్యంలో సిబ్బందికి ప్రత్యేక విధులు

- మరికొందరు సిబ్బందికి విధుల మార్పు

భద్రాచలం, జనవరి 22: భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో రాబోయే శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని పలువురు సిబ్బందికి ప్రత్యేక విధులు కేటాయిస్తూ దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి ఉత్తర్వులు జారీ చేశారు. భద్రాద్రి దేవస్థానానికి అనుబంధంగా ఉన్న పర్ణశాల దేవాలయంలో నిర్వహించే వివిధ అభివృద్ధి పనులను పర్యవేక్షించేందుకు ఏఈవో వి.శ్రవణ్‌కుమార్, పర్యవేక్షకుడు కె.శ్రీనివాసరావును ప్రతి రోజు పర్ణశాల ఆలయం వద్ద అభివృద్ధి పనుల పురోగతిని పర్యవేక్షించాలని ఆదేశించారు. ఎప్పటికప్పుడు ఈవోకు పనుల పురోగతిని తెలియజేయాలన్నారు. సిస్టం అడ్మినిస్ట్రేటర్‌గా ఉన్న ఎం.అనిల్‌కుమార్ పర్ణశాల ఆలయంలో నిర్వహించనున్న పనులు పూర్తయ్యేంత వరకు పర్ణశాల ఆలయం వద్దనే ఉండి ఆ పనుల నిర్వహణ విధులను పర్యవేక్షించాలన్నారు. సీసీటూ ఈవోగా ఉన్న జూనియర్ అసిస్టెంటు కె.వెంకటేశ్వరరావుకు మేజర్ ఫెస్టివల్ ఎస్టాబ్లిష్‌మెంటు సెక్షన్లను అదనంగా కేటాయించారు. సీనియర్ అసిస్టెంటు ఏ శ్రీనివాసరెడ్డికి గోశాల, ల్యాండ్స్, లీజులు, లైసెన్సులు, లీగల్ మ్యాటర్ విధులు కేటాయించారు. జూనియర్ అసిస్టెంటు టి.రాకేష్‌కు అకౌంటెంట్, సీఆర్‌వో ఇన్‌చార్జిగా మార్పు చేశారు. మరో ఉద్యోగి కె.కుమారి జనరల్ క్లాత్ స్టోర్స్‌తో పాటు వార్షికోత్సవాలు, శ్రీరామదీక్ష, ట్రస్టుబోర్డు విభాగాలను కేటాయించారు. అలాగే ఎం.జ్యోతికి ప్రీ ఆడిట్, పోస్టు ఆడిట్, ఆర్‌టీఐ, ఈఎంవోఎస్, అవుట్‌సోర్సింగ్, ప్రయివేటు సెక్యూరిటీ విభాగాల విధులను కేటాయించారు. వెంటనే సంబంధిత ఉద్యోగులు బాధ్యతలను చేపట్టి ఎటువంటి పొరపాట్లు లేకుండా సక్రమంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. లేకుంటే కఠిన క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

విధేయతకు పెద్దపీట

- మల్లు కుటుంబాన్ని వరించిన మరో కీలక పదవి
- ఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వ అధికార ప్రతినిధిగా మల్లు రవి

వైరా, జనవరి 22: దాదాపు మూడు దశాబ్దాలకుపైగా కాంగ్రెస్ పార్టీకి వీరవిధేయుడిగా కొనసాగుతున్న టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీ డాక్టర్ మల్లు రవిని ఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వ అధికార ప్రతినిధిగా నియమించింది. ఇప్పటికే ఆయన సోదరుడు మల్లు భట్టి విక్రమార్క డిప్యూటీ సీఎంగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఖమ్మం జిల్లా వైరా మండలంలోని స్నానాల లక్ష్మీపురం గ్రామానికి చెందిన మల్లు కుటుంబం దాదాపు నాలుగున్నర దశాబ్దాలుగా జాతీయ, రాష్ట్రస్థాయిల్లోని కాంగ్రెస్‌లో కీలకంగా ఉంది. మొదట మల్లు అనంతరాములు 1979-80 ప్రాంతంలో ప్రత్యక్షంగా కాంగ్రెస్ రాజకీయాల్లోకి ప్రవేశించారు. అనంతరాములు వారసులుగా ఆయన సోదరులు డాక్టర్ రవి, భట్టి విక్రమార్క 1990నుంచి



డాక్టర్ మల్లు రవి

ఇప్పటివరకు కాంగ్రెస్ రాజకీయాల్లో తమదైన ముద్ర వేశారు. కాంగ్రెస్‌కు విధేయులుగా ఉంటున్నారు. ఇప్పుడు ఈ సోదరులిద్దరికి విధేయతే కలిసొచ్చింది. ఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధిగా నియమితులైన డాక్టర్ రవి 1990లో తన సోదరుడు అనంతరాములు అకాల మరణంతో ప్రభుత్వ ఉద్యోగాన్ని వీడి కాంగ్రెస్ రాజకీయాల్లోకి వచ్చారు. అప్పటికే తన సోదరుడు మరణంతో ఖాళీ అయిన ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని నాగర్‌కర్నూల్ ఎంపీగా తొలిసారి 1991లో పోటీచేసి విజయం సాధించారు. 1996లో ఎంపీగా ఓటమిపాలైన డాక్టర్ రవి ఆతర్వాత 1998లో ఎంపీగా విజయం సాధించారు. ఇక అప్పటి నుంచి పూర్తిస్థాయి రాజకీయాల్లో కొనసాగుతున్నారు. 2004లో వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే డాక్టర్ రవిని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధిగా ఢిల్లీలో నియమించారు. ఆపదవిలో కొనసాగుతూనే 2008లో జడ్చర్ల అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికల్లో డాక్టర్ రవి ఎమ్మెల్యేగా పోటీచేసి విజయం సాధించారు. ఒక దశలో ఆయన పీసీసీ అధ్యక్షుడిగా నియమితులవుతారని భావించిన తరుణంలో సీఎం వైఎస్ హెలీకాప్టర్ ప్రమాదంలో అకాల మరణం చెందడంతో ఆ అవకాశాన్ని కోల్పోయారు. ఆతర్వాత కూడా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని కాంగ్రెస్ రాజకీయాల్లో రవి తనదైన శైలిలో ముందుకు సాగుతున్నారు. ప్రస్తుత తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 2017లో కాంగ్రెస్‌లో చేరిన నాటి నుంచి డాక్టర్ రవి ఆయనకు అండగా ఉంటూ విధేయతను చాటుకున్నారు. ఇప్పుడు తనకు అన్నివిధాలుగా సొంత జిల్లాలో అండగా ఉన్న డాక్టర్ రవిని తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధిగా ఢిల్లీలో రేవంత్‌రెడ్డి నియమించారు. మల్లు సోదరుల్లో తమ్ముడు భట్టి విక్రమార్క డిప్యూటీ సీఎంగా అన్నఅయిన డాక్టర్ రవి క్యాబినెట్ ర్యాంకులో ఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధిగా నియమితులయ్యారు. వైరా మండలంలోని కుగ్రామమైన స్నానాల లక్ష్మీపురం గ్రామంలోని అతి సామాన్య కుటుంబానికి చెందిన మల్లు సోదరులు ఏకకాలంలో డిప్యూటీ సీఎంగా, క్యాబినెట్ హోదాలో ఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధిగా కొనసాగటం అరుదని తమకు గర్వకారణమని గ్రామప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

మతోన్మాద శక్తులను అడ్డుకుంటాం

- భారత్‌జోడో న్యాయ్ యాత్రతో మోదీకి భయం పట్టుకుంది
- మాజీ ఎంపీ వి. హనుమంతరావు



ర్యాలీలో వీహెచ్, జిల్లా, నగర అధ్యక్షులు పువ్వాళ్ల, జావీద్

ఖమ్మం సంక్షేమవిభాగం/ భద్రాచలం, జనవరి 22: దేశంలో మతోన్మాదశక్తులను విచ్ఛిన్నం చేసేందుకు ఏఐసీసీ మాజీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్‌జోడో న్యాయ్ యాత్రకు విశేషమైన స్పందన లభిస్తోందని రాజ్యసభ మాజీ సభ్యుడు వి. హనుమంతరావు అన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ఓటమి భయంతోనే ప్రధాని మోదీ న్యాయ్ యాత్రలో పాల్గొన్న రాహుల్‌గాంధీపై దాడులు చేయించారని విమర్శించారు. జిల్లా, నగర కాంగ్రెస్ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, ఎండీ జావీద్ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి ఖమ్మం ధర్నా చౌక్ నుంచి జడ్పీసెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వరకు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి, జడ్పీసెంటర్‌లో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా హనుమంతరావు మాట్లాడుతూ రాహుల్‌గాంధీని ప్రధానమంత్రిని చేసేవరకు ప్రతి కాంగ్రెస్ కార్యకర్త ఎన్నిదాడులు ఎదుర్కొనైనా ముందుకు వెళ్తామన్నారు. మతోన్మాదశక్తులను, రాజకీయ పార్టీలను అడ్డుకొని తీరుతామన్నారు. ఈ కార్యక్రమంలో నగర వర్కింగ్ ప్రెసిడెంట్ నాగండ్ల దీపక్‌చౌదరి, కార్పొరేటర్లు మలీదు వెంకటేశ్వర్లు, లకావత్ సైదులునాయక్, మిక్కిలినేని మంజుల, ఫాతిమాజోహారా, విజయ నిర్మల, మాజీ కార్పొరేటర్ వడ్డెబోయిన నర్సింహారావు, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, ముజాహిద్ హుస్సేన్, సయ్యద్ గౌస్, రబ్బానీ, శేఖర్‌గౌడ్, ఏలూరి రవికుమార్, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

నా పేరే హనుమంతు.. నాకంటే రామభక్తుడెవరు

'నా పేరే హనుమంతు. నాకంటే రామభక్తుడెరు. భక్తి అనేది హృదయంలో ఉండాలని నాకు ఎప్పుడు దేవున్ని దర్శించాలని భావిస్తే అప్పుడే తిరుపతి వెంకన్న అయినా, భద్రాద్రి రామయ్య అయినా, యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి అయినా దర్శించుకుంటాని' మాజీ ఎంపీ వి.హనుమంతరావు అన్నారు. సోమవారం భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయాన్ని ఆయన దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కొద్దిసేపు విలేకర్లతో మాట్లాడారు. భద్రాద్రి రామయ్యకు అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రాణప్రతిష్ఠ ఆహ్వానం అందకపోవడం ఎంతో బాధగా ఉందన్నారు. అందరినీ రమ్మని ఆహ్వానాలిస్తూ భద్రాద్రి దేవస్థానానికి మాత్రం రిక్తహస్తం చూపడం భావ్యం కాదన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని భద్రాద్రి రామాలయానికి ఆహ్వానం ఇవ్వలేదా.. లేక భద్రాద్రి రామయ్య గురించి తెలియదా అని ప్రశ్నించారు.

సింగరేణి మెడికల్ బోర్డులో పైరవీలకు తావులేదు

- దళారులను నమ్మి మోసపోవద్దు
- సింగరేణి సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.బలరాం



సీఎండీ బలరాంకు పుష్పగుచ్ఛాన్ని అందజేస్తున్న దృశ్యం

కొత్తగూడెం, జనవరి22: సింగరేణిలో మెడికల్ బోర్డులో పైరవీలకు ఎలాంటి తావు లేదని, దళారులకు డబ్బులు చెల్లించి మోసపోవద్దు అని సింగరేణి సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.బలరాం తెలిపారు. ఏసీబీ డీజీపీ సీవీ ఆనంద్ ఆదేశాల మేరకు సోమవారం సింగరేణి ప్రధాన కార్యాలయంలో ఖమ్మం ఏసీబీ డీఎస్పీ వై.రమేష్, విజిలెన్సు అధికారి వరప్రసాద్‌లతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించి మెడికల్ బోర్డుపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో మెడికల్ బోర్డులో పైరవీలు చేయిస్తామని చెప్పి డబ్బులు వసూలుచేసిన కొంతమంది ఉద్యోగులపై క్రమశిక్షణ చర్యలు తీసుకున్నామని, పలువురు ఉద్యోగులను డిస్మిస్ చేశామన్నారు. మెడికల్ బోర్డు నిర్వాహణ పూర్తి పారదర్శకంగా జరిగేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇక ముందు కూడా మెడికల్ బోర్డులో పైరవీలు చేయిస్తామని చెప్పి ఉద్యోగులు డబ్బులు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తా మని తెలిపారు. అనంతరం ఏసీబీ డీఎస్పీ వై.రమేష్ మాట్లాడుతూ సంస్థలో పని చేసే అనుమానాస్పద ఉద్యోగుల కదలికలపై పూర్తి నిఘా ఉంచుతామని, ఒక వేళ ఎవరైన మెడికల్ బోర్డులో పైరవీల నెపంతో ఉద్యోగుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నట్లు తెలిసినట్లయితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కరసేవకులకు సన్మానం



చెన్నారావు దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

పెనుబల్లి, జనవరి 22: అయోధ్యలో రామమందిర నిర్మాణం కోసం 1992వ సంవత్సరంలో అయోధ్యకు వెళ్లి కరసేవలో పాల్గొన్న పెనుబల్లివాసులు 18మందిని సోమవారం పెనుబల్లి కోదండ రామాలయంలో భక్తులు, ఆలయ కమిటీ నిర్వాహకులు సన్మానించారు. రామ జన్మభూమి వద్దకు 1992లో వేలాదిమంది అయోధ్యకు వెళ్లారు. వారిలో పెనుబల్లికి చెందిన బొర్రా భద్రయ్య, దామెర సత్యం, బెజవాడ చెన్నారావు, గుంజా నారాయణ, కేతేపల్లి శ్రీను, లక్ష్మీనర్సు, చెక్కా మధుసూదన్‌రావు, రావుల వెంకటేశ్వరరావు, గోదా పుల్లయ్య, గోదా కృష్ణ, గోదా శేషు, గోదా వెంకటేశ్వరరావు, శ్రీను, నాయుడు గోవర్ధన్, మస్తాన్‌రెడ్డి, శ్రీనివాసరావు పాల్గొనగా వారిలో కొందరు మృతిచెందారు. వారి వారసులతోపాటు ప్రస్తుతం ఆలయానికి వచ్చిన కరసేవకుల దంపతులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు చిట్లూరి సత్యనారాయణ, వేముల కామేశ్వరరావు, గ్రామపెద్దలు కోటగిరి సుధాకర్‌రావు, తావూనాయక్, పల్లబోతుల రామకృష్ణారావు, అర్చకుడు శ్రీరంగం వెంకటాచార్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

దరఖాస్తుల పరిష్కారాన్ని వేగిరం చేయాలి

- ప్రజావాణిలో అదనపు కలెక్టర్ సత్యప్రసాద్



ఫిర్యాదులను స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ సత్యప్రసాద్

ఖమ్మం కలెక్టరేట్, జనవరి 22: ప్రజల నుంచి అందే ప్రతీ దరఖాస్తును పరిష్కరించాలని, మరింత వేగిరంగా స్పందించాలని జిల్లా అదనపు కలెక్టర్ బి సత్యప్రసాద్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజావాణి జిల్లా నలుమూలల నుంచి ప్రజలు వచ్చి తమ సమస్యలకోసం దరఖాస్తులు అందిస్తున్నారని వీటి పరిష్కారం కోసం ఆయా శాఖల అధికారులు కృషిచేయాలన్నారు. ఈ సందర్భంగా ఆర్జీలను ఆయన స్వీకరించి ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు సీఈవో వింజం వెంకట అప్పారావు, బీసీ వెల్ఫేర్ అధికారి జ్యోతి, డీసీవో విజయకుమారి, డీఎంహెచ్‌వో డాక్టర్ బి మాలతి, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ బి వెంకటేశ్వర్లు, డీఆర్డీవో విద్యాచందన, డీపీవో హరికిషన్ తదితరులు పాల్గొన్నారు.

రిపబ్లిక్ వేడుకలకు గిరిజన రైతు దంపతులు

- ఆహ్వానం అందిందన్న ఉద్యాన అధికారి



డ్రాగన్ ఫ్రూట్ పంటతో గిరిజన దంపతులు గంగరాజు, లక్ష్మీ

కొత్తగూడెం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): జనవరి 26న ఢిల్లీలో నిర్వహించనున్న గణతంత్ర వేడుకల ఆహ్వానం భద్రాద్రి జిల్లాలోని ఓ గిరిజన రైతు దంపతులకు అందింది. ఉద్యాన శాఖ తరుపున దుమ్ముగూడెం మండలం కమలాపురం గ్రామానికి చెందిన పెనుబల్లి గంగరాజు, లక్ష్మీలకు గణతంత్ర వేడుకల్లో పాల్గొనే అవకాశం లభించిందని ఉద్యాన అధికారి జీనుగు మరియన్న సోమవారం తెలిపారు. ఈ రైతు దంపతులు డ్రాగన్ ఫ్రూట్, ఆయిల్‌పామ్, మామిడి, జామ, సీతాఫలం, ఆపిల్ బేర్, కూరగాయలు మొదలైన ఉద్యానవన పంటల సాగులో ఆధునిక పద్ధతులలో రైతు బిందుసేద్యం, మల్చింగ్, సేంద్రీయ పదజితతులు పాటిస్తున్నారని ఆయన తెలిపారు. గిరిజన రైతు దంపతులను జిల్లా ఉద్యానశాఖ అధికారి వారిని అభినందించారు.

చట్టసభల్లో బీసీ వాటా బిల్లు పెట్టాలి


- భద్రాచలం చేరిన రథయాత్ర



వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

భద్రాచలం, జనవరి 22: చట్టసభల్లో బీసీ వాటా బిల్లు పెట్టాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్‌లోని జగద్గిరి గుట్ట నుంచి భద్రాచలానికి ఈ నెల 21న ప్రారంభమైన రథయాత్ర సోమవారం భద్రాచలం చేరుకుంది. ఈ సందర్భంగా హిందూ బీసీ మహాసభ అధ్యక్షుడు బత్తుల సిద్ధేశ్వర్ ఆధ్వర్యంలో నాయకులు భద్రాద్రి రామయ్యను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వినతిపత్రాన్ని రామయ్య సన్నిధిలో ఉంచాలని కోరుతూ వైదిక సిబ్బందికి అందజేశారు. తానీషాకు దర్శనమిచ్చిన రాములవారు ప్రధాని మోదీకి బిల్లుపెట్టే ఆలోచన కలిగించాలని కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పర్వత సతీష్‌కుమార్, అంజనేయులు, వెంకటస్వామి, మల్లయ్య, కొంగర నరహరి, తిరుపతయ్య పాల్గొన్నారు.

ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
ఖమ్మం
ఖమ్మం, పాలేరు, మధిర, వైరా, సత్తుపల్లి
8
మంగళవారం 23 జనవరి 2024



మైనారిటీ గురుకులాల్లో అడ్మిషన్ల కోసం ర్యాలీలు

ఖమ్మం ఖానాపురంహవేలి జనవరి 22: 2024-25 విద్యా సంవత్సరంలో మైనారిటీ గురుకులాల్లో ప్రవేశాలకు సంబంధించి ఖమ్మం నగరంలోని జలగంనగర్, రఘునాథపాలెంలోని ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్ ఆధ్వర్యంలో నగరంలోని పలు ప్రాంతాల్లో ర్యాలీలు నిర్వహించారు. రఘునాథపాలెం మైనారిటి గురుకులం బాలికల పాఠశాలలో ప్రవేశాలకు సంబందించి సోమవారం నగరంలోని పాండురంగాపురం, వైఎస్ఆర్ నగర్ బాలాజీనగర్, ప్రశాంతినగర్ తదితర ప్రాంతాల్లో ర్యాలీలు నిర్వహించారు. జలగంనగర్ గురుకులంలో ప్రవేశాలకోసం నగరంలో ర్యాలీ నిర్వహించారు. ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్ రవికుమార్, స్వాతి మాట్లాడుతూ ఉచిత ఆంగ్ల విద్య, నాణ్యమైన బోజనం, వసతి, తో పాటు ఇంటి వాతావరణం తలపించేలా హాస్టల్ వసతికల్పిస్తున్నట్లు తెలిపారు. ఫిబ్రవరి 6 వరకు అడ్మిషన్లకు అవకాశం ఉన్నట్లు తెలిపారు. విద్యార్థులు, తల్లి తండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


ఖమ్మం రామకృష్ణ విద్యాలయంలో


బాలరాముడి ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని వీక్షిస్తున్న న్యాయవాదులు


జమలాపురంలో సీతారాముల కల్యాణం


గాంధీచౌక్ రామాలయంలో 485దీపాలతో దీపోత్సవ దృశ్యం


స్మార్ట్‌కిడ్స్ పాఠశాలలో జై శ్రీరామ ఆకారం


ఏన్కూరులో ర్యాలీ


ఏన్కూరులో ర్యాలీ

వాడవాడలా జై శ్రీరాం

- ఆలయాల్లో మారుమోగిన రామనామం
- అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రతిష్ఠ నేపథ్యంలో ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అన్నదానాలు

నెట్‌వర్క్: అయోధ్యలోని శ్రీరామ మందిరంలో బాల రాముని ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా జిల్లా అంతటా జై శ్రీరామ్ అంటూ మారుమ్రోగింది. తెల్లవారుజాము నుంచి స్వామివారికి అభిషేకం, అలంకరణ విశేష పూజలు, సంక్షేమ రామాయణం పారాయణం, శ్రీరామ జయరామ జయజయ రామ తారక మంత్రాన్ని 108సార్లు జపంచేసి 11సార్లు హనుమాన్ చాలీసా పఠించారు. అదేవిధంగా ఆయా ఆలయాలలో దాతల సహకారంతో ఎల్ఈడీ స్క్రీన్లను ఏర్పాటు చేసి శ్రీరామ జన్మభూమి మందిర బాలరాముని ప్రతిష్ఠ కార్యక్రమం లైవ్ ఏర్పాటు చేయగా భక్తులు వీక్షించారు. అనంతరం ఆలయాలలో భక్తుల కోసం అన్నప్రసాద సమర్పణ గావించారు. సాయంత్రం ఆలయాల ఆధ్వర్యంలో శోభాయాత్ర నిర్వహించగా మహిళలు, చిన్నారులు కోలాటమాడి అలరించారు. బాణాచంచా పేల్చి సంబరాలు నిర్వహించారు.

మానవాళికి పండుగ రోజు

ఐదొందల ఏళ్ల నిరీక్షణ ఫలితం ఈవేళ శ్రీరామచంద్రుడు తన జన్మస్థానంలో సుస్థిరపడుతున్నాడని, ఇది భారతజాతికే మాత్రమే కాకుండా యావత్ మానవాళికి పండుగ రోజు అని ఆధ్యాత్మికవేత్త, ప్రవచనకర్త, ఉపన్యాసరత్న నల్లాన్ చక్రవర్తుల రామకృష్ణమాచార్యస్వామి అన్నారు. మండలంలోని రేజర్లలో వేంచేసియున్న శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో ప్రతిష్ఠ మహోత్సవాన్ని పురస్కరించుకుని వేడుకలు సాగాయి.

శ్రీరాముని జెండాలను పంచిన ముస్లిం యువకుడు

నేలకొండపల్లి:మతాలకు అతీతంగా అయోధ్యలో శ్రీరాముని విగ్రహ ప్రతిష్ఠకు జనం నీరాజనాలు పలుకుతున్నారు. ఊరూరా శోభా యాత్రలు నిర్వహిస్తున్నారు. నేలకొండపల్లి మండల పరిధిలోని రాజేశ్వరపురం గ్రామానికి చెందిన ముస్లిం యువకుడు షేక్.అబ్బాస్‌ఆలీ శ్రీరామునిపై ఉన్న నమ్మకం, ఆరాధనతో గ్రామంలో శ్రీరాముని జెండాలను ఇంటింటికి పంపిణీ చేశారు. ఇంటింటికీ జెండాలను పంపిణీ చేశారు.


తల్లాడలో..


ముదిగొండలో..


కారేపల్లిలో..


ఖమ్మం వర్తకుల రామాలయంలో..


సత్తుపల్లిలో శోభయాత్ర


వేంసూరులో..


మధిరలో..


వైరాలో..


ఖమ్మం మామిళ్లగూడెంలో శోభయాత్ర


తిరుమలాయపాలెంలో..


ఖమ్మం గాంధీచౌక్‌లో..


నేలకొండపల్లిలో..

దేశాన్ని విడగొట్టాలని చూస్తున్నారు

కొవ్వొత్తులతో కాంగ్రెస్ నిరసన ర్యాలీ


సత్తుపల్లిలో నిరసన ర్యాలీ

సత్తుపల్లిరూరల్/వైరా/కూసుమంచి జనవరి22: మతతత్వ శక్తులు, మతోన్మాదం, కులోన్మాదం, ప్రాంతీతయ తత్వం రెచ్చగొట్టి మనదేశాన్ని విడగొట్టాలని కొందరు చూస్తున్నారని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ అన్నారు. అస్సాంలో రాహుల్‌గాంధీ యాత్రకు అడ్డుకోవడాన్ని నిరసిస్తూ సత్తుపల్లి మునిసిపాలిటీలో జాతీయ రహదారిపై కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ తీశారు. పదవుల కోసం ఆరాటపడకుండా ప్రజల కోసం ప్రాణాలర్పించిన కుటుంబానికి దేశ ప్రజలంతా అండగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైరా: అస్సాం రాష్ట్రంలో రాహుల్‌గాంధీ భారత జోడో న్యాయ యాత్రను బీజేపీ కార్యకర్తలు అడ్డుకోవడాన్ని నిరసిస్తూ సోమవారం రాత్రి వైరాలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో కొవ్వత్తులతో నిరసన ర్యాలీ నిర్వహించారు. వైరా మున్సిపల్ ఛైర్మన్ సూతకాని జైపాల్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి, నాయకులు, కట్ల రంగారావు, దాసరి దానియేలు, మిట్టపల్లి నాగి, దార్నా రాజశేఖర్, పణితి సైదులు, పణితి శ్రీను, దార్నా రాజఖర్, బత్తుల గీత, శ్రీను, ఖమ్మం మీరా, చెరుకూరి కిరణ్, పమ్మి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

కూసుమంచి: అస్సాంలో రాహుల్‌గాంధీ భారత్ జోడో న్యాయయత్రను బీజేపీ నేతలు అడ్డుకోవడాన్ని నిరసిస్తూ ఏఐసీసీ పిలుపుమేరకు కూసుమంచిలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు రాస్తారోకోనిర్వహించారు. ఖమ్మం-సూర్యాపేట ప్రధానరహదారిపై నిరసన వ్యక్తం చేశారు. రహదారికి ఇరువైపుల వాహనాలు నిలిచిపోయాయి. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శివుని విగ్రహాన్ని ఆవిష్కరించిన డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల

వైరా, జనవరి 22: మండలంలోని రెబ్బవరం హిందూ శ్మశాన వాటిక వద్ద ఏర్పాటుచేసిన భారీ శివుని విగ్రహాన్ని, చేతిపంపును, భూమిదాత శిలాఫలకాన్ని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ సోమవారం ఆవిష్కరించారు. రిటైర్డ్ ఉపాధ్యాయుడు తాళ్లూరి శేషయ్య జ్ఞాపకార్థం ఆయన భార్య తాళ్లూరి నాగలక్ష్మీ, కుమారుడైన ఎన్నారై తాళ్లూరి మురళీ అలాగే దివంగతులైన కుమారులు వెంకటకృష్ణ, రాంబాబు కుటుంబసభ్యులు శివుని విగ్రహాన్ని అందజేశారు. అలాగే దివంగత వల్లభి సుబ్బయ్య, శాంతమ్మ దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారుడు వల్లభి వెంకటేశ్వరరావు చేతిపంపును ఏర్పాటుచేశారు. దాతలను డీసీసీ అధ్యక్షుడు దుర్గాప్రసాద్ అభినందించారు. శ్మశాన వాటిక నిర్మాణానికి అవసరమైన భూమిని కొలిపాక రామకృష్ణ, పర్మానందరావు సమకూర్చారు. వారిని కూడా ఆయన అభినందించారు. కార్యక్రమంలో రెబ్బవరం సర్పంచ్ సాదం రామారావు, మాజీ సర్పంచ్, ఉప సర్పంచ్‌లు దాసరి దానియేలు, తాళ్లూరి వెంకటయ్య, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి అలాగే వల్లభి శ్రీనివాసరావు, గుత్తా రామారావు, వెంకటేశ్వరరావు, నాగరాజు, తాళ్లూరి నాగేశ్వరరావు, ఆకుల రమేష్, పొదిల హరినాథ్, పాలేటి నర్సింహారావు, చవిడిశెట్టి శ్యాంసుందర్, దొబ్బల నాగయ్య, కృష్ణయ్య, చిత్తారి శ్రీను, వనమా చిన్నసత్యనారాయణ, బత్తుల రామకృష్ణ పాల్గొన్నారు.

లెనిన్ స్ఫూర్తితో ముందుకెళ్లాలి

తల్లాడ, జనవరి 22: పీడిత ప్రజలపై జరుగుతున్న దోపిడీని నిర్మూలించటానికి సోషలిజాన్ని పోరాడే శక్తులకు ఆయుధంగా అందించిన ప్రపంచ విప్లవ ఉద్యమనిర్మాత వీఐ.లెనిన్ స్ఫూర్తితో ముందుకు సాగాలని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ జిల్లా కమిటీ సభ్యుడు షేక్.లాల్‌మియా అన్నారు. సోమవారం తల్లాడలో మాస్‌లైన్, ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో లెనిన్ వర్థంతిని నిర్వహించి ఆయన చిత్రపటానికి జోహార్లు అర్పించారు. ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసరావు, బ్రాంచ్ కమిటీ అధ్యక్షుడు నాగూల్‌మీరా పాల్గొన్నారు.

ప్రాంగణ నియామకాల్లో 44 మంది ఎంపిక


విద్యార్థులతో కళాశాల ఛైర్మన్ కృష్ణ

ఖమ్మం ఖానాపురంహవేలి, జనవరి 22: ఖమ్మం నగరంలోని ఎస్‌బీఐటీ ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం నిర్వహించిన ప్రాంగణ నియామకాల్లో కళాశాలకు చెందిన 44 మంది విద్యార్థులు ఎంపికయ్యారని కళాశాల ఛైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు రూ 4.5లక్షల వార్షికవేతనం ఉంటుందని తెలిపారు. రానున్న రోజుల్లో కళాశాలనుండి మరిన్ని ప్రాంగణ నియామకాలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ జి.ధాత్రి, ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్, పాల్గొన్నారు.

పీఎస్ఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో క్రికెట్ కిట్ల పంపిణీ

ఖమ్మం రూరల్, జనవరి 22: మండల పరిదిలోని వరంగల్ క్రాస్‌రోడ్డులోని శ్రీరామ్‌నగర్ కాలనీలో యువకులకు పీఎస్ఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో క్రికెట్ కిట్లను సీపీఐ, కాంగ్రెస్ నాయకులు సోమవారం అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ, కాంగ్రెస్ నాయకులు దండి రంగారావు, సురేందర్, భూక్యా సురేష్, రవి, శశిరెడ్డి, హుస్సైన్, రాజు, భుజంగరెడ్డి, రమేష్, శ్రీనివాస్‌రెడ్డి, శివలింగం, కిరన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

విప్పలమడకలో సొసైటీ గోదాం ప్రారంభం

వైరా, జనవరి 22: మండలంలోని గరికపాడు సొసైటీ పరిధిలో ఉన్న విప్పలమడకలో రూ.24లక్షల నాబార్డు నిధులతో నిర్మించిన గోదామును సొసైటీ అధ్యక్షుడు అయిలూరి కృష్ణారెడ్డి సోమవారం ప్రారంభించారు. 300మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో విప్పలమడక రైతుల అవసరాల నిమిత్తం ఈ గోదామును నిర్మించారు. ఉపాధ్యక్షుడు అయిలూరి కృష్ణారెడ్డి, విప్పలమడక, గరికపాడు, దాచాపురం సర్పంచ్‌లు తుమ్మల జాన్‌పాపయ్య, కోట ఎలీషా, వేల్పుల జయరాజు, విప్పలమడక, లింగన్నపాలెం మాజీ సర్పంచ్‌లు పారుపల్లి కృష్ణారావు, తోటకూర రామారావు, సొసైటీ సీఈవో అక్కిశెట్టి రామకృష్ణ, డైరెక్టర్లు పాల్గొన్నారు.

కరాటేలో సత్తుపల్లి విద్యార్థుల ప్రతిభ

సత్తుపల్లి, జనవరి 22: గతవారం హైదరాబాద్‌లోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియంలో నిర్వహించిన ఫిలాడీ సిరీస్-1 నేషనల్ కరాటే ఛాంపియన్ షిప్‌లో సత్తుపల్లి విద్యార్థులు పతకాలు సాధించినట్లు మాస్టర్ వీ.పిచ్చయ్య సోమవారం తెలిపారు. 7బంగారు, 3వెండి, 3కాంస్య పతకాలు, కుమిటేలో రన్నరప్‌లో గ్రాండ్ ఛాంపియన్‌షిప్ గెలుచుకున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులను మాస్టర్‌తో పాటు ప్రముఖులు అభినందించారు.

కుర్నవల్లి హైస్కూల్‌కు మైకు బహూకరణ

తల్లాడ, జనవరి 22: తల్లాడ మండలం కుర్నవల్లి ఉన్నత పాఠశాలలో సోమవారం స్వాతంత్ర్య సమరయోధులు బోడేపూడి సూరయ్య, సావిత్రమ్మ దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారులు, పూర్వవిద్యార్థులు బోడేపూడి బాబు, రాజారావు మైకును బహూకరించారు. సుమారు రూ.25వేలు విలువచేసే మైకుసెట్‌ను ప్రధానోపాధ్యాయుడు శీలం శ్రీనివాసరెడ్డికి అందజేశారు. చదువుకున్న పాఠశాల అభివృద్ధికి హితోదికంగా మైకును బహూకరించిన బాబు, రాజారావులను పలువురు అభినందించారు.

సత్తుపల్లి చేరుకున్న ప్రత్యంగిరా అమ్మవారి విగ్రహం

సత్తుపల్లి, జనవరి22: సత్తుపల్లిలోని లక్ష్మీగణపతి ఆలయ ప్రాంగణంలో వచ్చేనెల 10వ తేదీ నుంచి జరుగనున్న 11కోట్ల కుంకుమార్చన సహిత రాజశ్యామల మహాయాగంలో ప్రత్యేకంగా ప్రత్యంగిరా అమ్మవారు పూజలను అందుకోనున్నారు. మహాబలిపురంలో రూపుదిద్దుకున్న ప్రత్యంగిరా అమ్మవారి విగ్రహాన్ని సోమవారం సత్తుపల్లికి తరలించారు.

స్థానిక నాయకుల ఆమోదం మేరకే చేరికలు

- వివక్షకు గురైన గ్రామాలను ఆదుకుంటాం
- కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీలో మంత్రి తుమ్మల


చెక్కులు పంపిణీ చేస్తున్న తుమ్మల

రఘునాథపాలెం, జనవరి 22: గత ప్రభుత్వంలో ప్రజాప్రతినిధుల రాజకీయాల కారణంగా కొన్ని గ్రామ పంచాయతీలు వివక్షకు గురైనాయని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వంలో అటువంటి వివక్షతో కూడిన రాజకీయాలు ఉండవని అన్ని గ్రామ పంచాయతీలకు న్యాయం చేస్తూ గతంలో వివక్షకు గురైన గ్రామ పంచాయతీలకు ప్రత్యేకంగా అభివృద్ధి చేస్తామని రాష్ట్ర వ్యవసాయ,మార్కెటింగ్ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హామీ ఇచ్చారు. ఈర్లపూడి వంటి మారుమూల గిరిజన గ్రామ పంచాయతీలు వివక్షకు గురై కనీసం రహదారులు కూడా నిర్మాణం చేయలేదని, రైతులు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. సోమవారం రఘునాథపాలెం మండలం ఈర్లపూడిలో గ్రామ సర్పంచి దేవ్‌సింగ్ అధ్యక్షతన నిర్వహించిన బహిరంగ సభలో రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావటంతో ఇతర పార్టీల నుంచి పెద్ద ఎత్తున కాంగ్రెస్‌లో చెరేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని, స్థానికంగా కాంగ్రెస్ నాయకుల అమోదం తెలిపిన వారిని మాత్రమే తాము కాంగ్రెస్‌లోకి ఆహ్వానించటం జరుగుతుందన్నారు. గ్రామస్థాయిలో కష్టపడి పనిచేసిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు ఖచ్చితంగా గుర్తింపు, గౌరవం దక్కుతుందన్నారు. అర్హులందరికి సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. రఘునాథపాలెం మండలానికి చెందిన 57మంది కళ్యాణలక్ష్మీ, షాది ముబారక్ లబ్దిదారులకు రూ.1,00,016ల చొప్పున మొత్తం రూ.57,06,612ల చెక్కులను పంపిణీ చేశారు. ఎంపీపీ భూక్య గౌరి, జెడ్పీటీసీ ప్రియాంక, తహసిల్దారు లూధర్‌విల్సన్, ఎంపీడీవో రామకృష్ణ, ఖమ్మం ఏఎంసీ ఛైర్మన్ మానుకొండ రాధాకిషోర్, వాంకుడోత్ దీప్లా, సాదు రమేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

తుమ్మల సమక్షంలో చేరిక

మంచుకొండ గ్రామ సర్పంచి వాంకుడోత్ విజయాదీపక్ ఆధ్వర్యంలో గ్రామంలోని పలు కుటుంబాలకు చెందిన వారు కాంగ్రెస్‌లో చేరారు. మంచుకొండలో సోమవారం రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పర్యటించటంతో ఆయన వద్దకు చేరుకొని కాంగ్రెస్ కండువాలను కప్పుకొని కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం ఏఎంసీ మాజీ ఛైర్మన్ మానుకొండ రాధాకిషోర్, మందడపు భాస్కర్, ప్రేమ్‌కుమార్, దొంతబోయిన సత్యనారాయణ, భూక్య భద్రునాయక్, అర్వపల్లి వీరయ్య, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సీపీఐ నాయకునికి తుమ్మల పరామర్శ

నేలకొండపల్లి: సీపీఐ మండల కార్యదర్శి కర్నాటి భానుప్రసాద్‌ను సోమవారం వ్యవసాయ శాకా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పరామర్శించారు. హైదరాబాద్ నుంచి ఖమ్మం వెళుతూ మార్గమధ్యంలో కొత్తకొత్తూరు గ్రామంలోని భాను ఇంటికి తుమ్మల వెళ్ళారు, ఇటీవలి కాలంలో భాను అస్వస్థతకు గురికాగా ఎన్నికల కారణంగా తుమ్మల పరామర్శించలేక పోయారు. సోమవారం హైదరాబాద్ నుంచి ఖమ్మం వెళుతూ భానుప్రసాద్‌ను పరామర్శించారు. కార్యక్రమంలో సాధు రమేష్‌రెడ్డి, వేగినాటి లక్ష్మీనర్సయ్య, చావా గణపతిరావు, మారిశెట్టి వెంకటేశ్వర్లు, ఉండెమోదుగుల శ్రీనివాసరావు, రావెళ్ళ జ్యోతిబసు తదితరులున్నారు.

శ్రీఅభయాంజనేయ స్వామి విగ్రహ భూమి పూజ కార్యక్రమం

కల్లూరు, జనవరి 22: కల్లూరులోని రామానగర్‌లో సోమవారం శ్రీఅభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠా ఏర్పాటుకై వడ్డెర సంఘం ఆధ్వర్యంలో భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ ఈ విగ్రహ ప్రతిష్ఠాపనకు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పసుమర్తి చందర్‌రావు, ఎస్‌కె యాఖుబ్ అలి, బాగం ప్రభాకర్‌రావు, ఉబ్బన గోపాలస్వామి, బైర్ల కాంతరావు, పెద్దబోయిన శ్రీను, పొన్నూరు వెంకటేశ్వరావు, విగ్రహ ప్రతిష్ఠ కమిటీ నిర్వహకులు కుంచాల గురవయ్య, గండికోట చిన్న,తిరుపతి బిక్షం, ఓర్సు వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

పండితాపురంలో విగ్రహ ప్రతిష్ఠ



కామేపల్లి: కామేపల్లి మండల పరిధిలోని పండితాపురంలో అదే గ్రామానికి చెందిన కొమ్ము ముత్తయ్య భారతమ్మ జ్ఞాపకార్థం కుమారుడు కొమ్ము నాగేశ్వరరావు తన సొంత ఖర్చుతో.. ఆంజయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ చేశారు. అంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

తిరుమలాపురంలో భగీరథ సీఈ ఇంటింటి సర్వే

నేలకొండపల్లి, జనవరి 22: మిషన్ భగీరథ సీఈ కె.శ్రీనివాసరావు సోమవారం సాయంత్రం మండల పరిధిలోని తిరుమలాపురంతండాలో ఇంటింటి సర్వే నిర్వహించారు. ర్యాండమ్ సర్వేలో భాగంగా 200 అంత కంటే తక్కువ కనెక్షన్లున్న గ్రామాలను ఎంచుకుని సర్వే చేస్తున్నారు. అందులో భాగంగా ఇంటింటికీ తిరుగుతూ మిషన్ భగీరథ నీటి సరఫరా ఎలా ఉంది?ఇబ్బందులేమైనా ఉన్నాయాఅంటూ ప్రశ్నించారు. 5ఇళ్ళల్లో మాత్రం నీటి సరఫరాలో ఇబ్బందులన్నాయని చెప్పగా, సత్వరమే పరిష్కరించాలని సిబ్బందిని ఆదేశించారు. ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ ఓంప్రకాష్, గ్రిడ్ ఏఈ భాస్కరరావు, కార్యదర్శి మహేష్‌రెడ్డిలు సీఈ వెంట ఉన్నారు.

ఆసుపత్రి భవన నిర్మాణాన్ని పరిశీలించిన డీఈ

పెనుబల్లి, జనవరి 22: పెనుబల్లి ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో నూతనంగా సుమారు రూ.ఆరున్నరకోట్లతో నిర్మిస్తున్న భవన నిర్మాణపనులను సోమవారం డీఈ పి.వెంకటేశ్వర్లు పరిశీలించారు. ఎన్‌హెచ్‌ఎస్‌ఎఫ్ నిధులు సుమారు రూ.ఆరున్నరకోట్లతో నూతన భవనాన్ని నిర్మిస్తున్నారు. డీఈ మాట్లాడుతూ నిర్మాణ పనులను నాణ్యతాప్రమాణాలతో చేపట్టాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. భవన నిర్మాణం పూర్తయిన తర్వాత రెండు సంవత్సరాలు కాంట్రాక్టర్ పర్యవేక్షణలో ఉంటుందన్నారు. పనుల్లో ఎటువంటి లోటుపాట్లు లేకుండా నిర్వహించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు.

పెద్దబీరవల్లి మాజీ సర్పంచ్ దుర్గమ్మ మృతి

బోనకల్, జనవరి 22: మండలంలోని పెద్దబీరవల్లి గ్రామ మాజీ సర్పంచ్ తాళ్లూరి దుర్గమ్మ(59) అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. పార్టీతో పాటుఅనుబంద సంఘాలతో నిర్వహించిన ప్రజా పోరాటాల్లో ఆమె చురుకుగా పాల్గొనేవారు. మృతదేహాన్ని సీపీఎం రాష్ట్ర నాయకులు పొన్నం వెంకటేశ్వరావు, పోతినేని సుదర్శన్‌రావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు చింతలచెర్వు కోటేశ్వరావు, వరప్రసాదరావు, దొండపాటి నాగేశ్వరావు, సర్పంచ్ ఆళ్ల పుల్లమ్మ తదితరులు సందర్శించి నివాళుర్పించారు.

నేడు అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష సమావేశం

వైరా, జనవరి 22: వైరాలో మంగళవారం ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్ నియోజకవర్గంలోని ఐదుమండలాల్లోని వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహిస్తారని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి తెలిపారు. కృషి విజ్ఞాన కేంద్రంలోని రైతు శిక్షణ భవనంలో ఈ సమీక్ష సమావేశాన్ని నిర్వహిస్తారని తెలిపారు.

సాగర్‌నీటిని విడుదల చేసి పంటలను కాపాడాలి

కొణిజర్ల, జనవరి 22: సాగర్‌జలాలను విడుదల చేసి ఆయకట్టు క్రింద ఎండుతున్న పంటలను కాపాడాలని అఖిల భారత రైతుకూలిసంఘం జిల్లా నాయకులు షేక్ ఖాసీం డిమాండ్ చేశారు. వర్షాలు లేక రైతులు ఇప్పటికే చాలా ఇబ్బందులు పడుతున్నారని, సాగర్ ఎడమకాలువ పరిధిలో మొక్కజొన్న, మినుము, పెసర పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సీతారామ ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేస్తే రైతులకు రెండు పంటలు వేసుకోవటానికి వీలుగా ఉంటుందని తెలిపారు. సాగర్‌నీరు రాకపోతే తాగునీళ్లు కూడ కరువయ్యే అవకాశం ఉందన్నారు.

పాఠశాలస్థాయి నాటకపోటీలు

తల్లాడ, జనవరి 22: పాఠశాలస్థాయి పదజాలాభివృద్ధి నాటిక పోటీలు సోమవారం తల్లాడ మండలం అన్నారుగూడెంలోని జడ్పీఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నిర్వహించారు. పోటీల్లో విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభను ప్రదర్శించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్ఎం మాదినేని నర్సింహారావు, ఉపాధ్యాయులు శారదాదేవి, రత్నకుమారి, రాజకుమారి, వై.సుచరిత, జీఎస్.మురళీకృష్ణ, పులి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మైనర్లు వాహనాలు నడపొద్దు: ఎంవీఐ

పెనుబల్లి, జనవరి 22: పాఠశాల విద్యార్థులు వాహనాలను నడపొద్దని, నడిపినట్లయితే వారిపైనే కాకుండా తల్లిదండ్రులపైన కూడా కేసులు నమోదు అవుతాయని సత్తుపల్లి మోటారు వెహికిల్ ఇన్‌స్పెక్టర్ సంగం వెంకటపుల్లయ్య హెచ్చరించారు. సోమవారం వీఎంబంజర్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మోటరు వాహన చట్టంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఈవీ.రామారావు, వనమా నాగేశ్వరరావు, రాజు, రవికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
ఆంధ్రజ్యోతి దినపత్రికలో పనిచేయుటకు నిరుద్యోగ యువకులకోసం ఈ క్రింది ఉద్యోగ అవకాశాలు కలవు.
ప్యాకర్స్ కావలెను
ఖమ్మం ఆంధ్రజ్యోతి యూనిట్ కార్యాలయంలో పేపర్ పార్సిల్ విభాగంలో పనిచేయుటకు ప్యాకర్స్ కావలెను,
అనుభవాన్ని బట్టి వేతనం నిర్ణయించబడును.
ఇంటర్వ్యూ స్థలము: ఆంధ్రజ్యోతి కార్యాలయం
సర్క్యులేషన్ మేనేజర్
ఆంధ్రజ్యోతి బిల్డింగ్స్, ప్లాట్స్ నెం: 112
ఇండస్ట్రియల్ ఏరియా, ఖానాపురం హవేలి
శ్రీ అభయ వేంకటేశ్వరస్వామి గుడి రోడ్డు, ఖమ్మం
సెల్: 9985411350